



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ






| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 165 | ది.2-10-2026 | శుక్రవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 165 | Date : 2-10-2026 | Friday | Pages : 8 | Rs.1/- |




## ప్రశాంతంగా, ఏకగ్రీవంగా శనగపాడు పాఠశాలల విద్యా కమిటీ ఎన్నికలు



**పెనుగంచిప్రోలు,అక్టోబర్ 1 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మండలం లోని శనగపాడు లో ఎంపీపీస్ పాఠశాల మరియు జెడ్ పి హెచ్ ఎస్ శనగపాడు పాఠశాలలో గురువారం జరిగిన ఎస్ యం సి ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినాయి. రెండు పాఠశాలలో 12 మంది సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించడం జరిగినది. జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాల నుండి చైర్మన్ గా కీసర బాబు రావు,వైస్ చైర్మన్ గా గాది కళ్యాణి ఎంపికైనారు. ఎం పిపి ఎస్ పాఠశాల నుండి చైర్మన్ గా కుక్కమూడి చక్రధర రావు,వైస్ చైర్మన్ గా ఎస్ కె . ముంతాజ్ బేగం ఎంపికైనారు. ఈ కార్యక్రమం లో యం ఈ ఓ డి. రవీంద్ర, జెడ్ పి హెచ్ ఎస్, హెచ్ యం వెంకయ్య , ఎంపీపీఎ స్ హెచ్ యం బి . వెంకటేశ్వర్లు, సీఆర్ పీ లు తులసి,సాంబ,ఉపాధ్యాయులు,తల్లి తండ్రులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్స్ పంపిణీ చేసిన ఆర్డీవో ఏ. కుమార్.



**తిరువూరు,అక్టోబర్ 1 (వార్తాప్రభ) :** తిరువూరు పట్టణంలో ఈరోజు ఎన్టీఆర్ భరోసా పెన్షన్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరువూరు రెవెన్యూ డివిజన్ అధికారి ఏ. కుమార్ పాల్గొని, పెన్షన్ లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి, ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ సదుపాయాల గురించి వివరించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పెన్షన్ సకాలంలో అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ఉద్యోగులు పాల్గొని, లబ్ధిదారులకు పెన్షన్స్ పంపిణీలో చేసియున్నారు

## ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో మారెమ్మ దేవాలయం చైర్మన్ టిఎస్ఆర్



**విస్సన్నపేట,అక్టోబర్ 1 (వార్తాప్రభ) :** స్థానిక మండలం లోని పుట్రేల గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో మారెమ్మ దేవాలయం చైర్మన్ తెర్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు. ప్రభుత్వపరంగా అందుతున్న వికలాంగ వృద్ధాప్య వితంతు ఒంటరి మహిళ చేనేత గీత డప్పు కళాకారులు హెచ్ఐవి బాధితులు తల సేమియా వ్యాధిగ్రస్తులు పక్షవాత పీడితులు తదితరులకు కూటమి ప్రభుత్వ సారాధ్యంలో పింఛన్లు అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## తెల్లవారుజాము నుంచి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ...



**పెనుగంచిప్రోలు,అక్టోబర్ 1 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు పట్టణంలోని ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ గురువారం తెల్లవారుజామున నుంచి జోరుగా సాగుతోంది. పట్టణంలోని 1 వ వార్డులో సిబ్బంది కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి వృద్ధులకు,వితంతువులకు, ది వ్యాంగులకు నీటి సంఘం అధ్యక్షులు కర్ల నాగేశ్వరావు, మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుదీర్ బాబు మైనార్టీ సెల్ నాయకులు మహమ్మద్ అజాద్ లు పింఛన్లనుఅందజేస్తున్నారు. అలాగే,పట్టణంలోని తూర్పు బజారు 5వ వార్డులో అంగన్వాడి సిబ్బందితో కలిసి జనసేన మండల ఉపాధ్యక్షుడు శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయ పాలకమండలి సభ్యులు తన్నీరు గోపీనాథ్ పంపిణీ చేశారు. 5వ వార్డులోని ప్రజలతో మమేకమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు,రానున్న స్థానిక ఎన్నికల కు ప్రజలంతా కూటమి ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు...

## 'పేదల సేవలో 2.0' - ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేసిన కూటమి నాయకులు



**కాకినాడ,అక్టోబర్ 1 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ సామాజిక భరోసా నెలవారి ఫించన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా కాకినాడ రూరల్ మండలం, రమణయ్యపేట పంచాయతీ పరిధిలోని రాయుడుపాలెంలో రూరల్ ఎంపీడీవో ఆధ్వర్యంలో నిర్వహించిన 'పేదల సేవలో 2.0' కార్యక్రమంలో పాల్గొని, లబ్ధిదారులకు స్వయంగా 'ఎన్టీఆర్ భరోసా' సామాజిక పింఛన్లను పంపిణీ చేసిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ,ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ సీఎం నారా చంద్రబాబు నాయుడు డిసిఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో పేదల సంక్షేమమే పరమావధిగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని అర్హులైన ప్రతి పేదవాడి గడపకూ సంక్షేమ పథకాలు చేరేలా కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు టీడీపీ రూరల్ ఇన్‌చార్జి పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ మాసుమేను మంగ గంగయ్య, తాటికాయల వీరబాబు,రామిశెట్టి సునీల్,తోటకూర సతీష్,కాళ్ల శ్రీనివాస్,సందీప్, ముద్దుర్తి రోహిత్ కుమార్,పంపన మహేష్, ఇజ్జపురెడ్డి యేసు,విత్తనాల రమణ సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజలు, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# పీఆర్సీ చైర్మన్ నియామకంపై ఏపీ ఎన్జీజీవో సంఘం హర్షం

- దినేష్ కుమార్ నియామకంతో వేతన సవరణకు కీలక ముందడుగు
- సీఎం హామీల నుంచి ఉత్తర్వుల వరకు.. కేవలం 25 రోజులు
- గౌరవ సీఎంకు సంఘం తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నాం
- ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్



**విజయవాడ,అక్టోబర్ 1 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన 12వ వేతన సవరణ సంఘం చైర్మన్‌గా విశ్రాంత ఐఏఎస్ అధికారి దినేష్ కుమార్‌ను ప్రభుత్వం నియమించడం పట్ల ఏపీ ఎన్జీజీవో సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎ. విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డి వి రమణ హర్షం వ్యక్తం చేశారు. దినేష్ కుమార్ నియామకంతో వేతన సవరణ ప్రక్రియ ముందుకు సాగేందుకు మార్గం సుగమమైందని ఆయన గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో 12వ వేతన సవరణ సంఘం చైర్మన్‌గా నియమితులైన డా. మన్మోహన్ సింగ్ రాజీనామా అనంతరం ఖాళీగా ఉన్న చైర్మన్ పదవిని ప్రభుత్వం భర్తీ చేయడం ఉద్యోగులకు సంబంధించిన వేతన సవరణ ప్రక్రియకు ప్రాధాన్యతనిచ్చినట్లు భావిస్తున్నామని విద్యాసాగర్ తెలిపారు. సెప్టెంబర్ 5న ముఖ్యమంత్రి ఇచ్చిన అన్ని హామీలకు 25 రోజుల్లోనే ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయమని, ఉద్యోగుల సమస్యలు, డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం పట్ల ముఖ్యమంత్రికి, ఉప ముఖ్యమంత్రికి, ఆర్థిక మంత్రికి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఏపీ ఎన్జీవో సంఘం తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగుల వేతన సవరణ, ఇతర సమస్యల పరిష్కారం కోసం ఏపీ ఎన్జీజీవో సంఘం, ఏపీ జేఏసీ నిరంతరం ప్రభుత్వంతో చర్చిస్తూ, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో కృషిచేశాయని విద్యాసాగర్ తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు, జారీచేసిన ఉత్తర్వులు పూర్తిస్థాయిలో అమలయ్యేలా కూడా సంఘం తరఫున నిరంతరం కృషిచేస్తూ కృషిచేస్తామని స్పష్టం చేశారు. పీఆర్సీ చైర్మన్ నియామకంతో వేతన సవరణకు సంబంధించిన తదుపరి కార్యాచరణ త్వరితగతిన ప్రారంభమవుతుందని ఆశిస్తున్నామని, ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరించడం, అవసరమైన సమాచారాన్ని సేకరించడం, పరిశీలన తదితర ప్రక్రియలు వేగంగా సాగుతాయని విద్యాసాగర్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న టెక్నాలజీ ఆధారంగా వేతన సవరణ ప్రక్రియ తొందరగా ముగియాలని కోరుకుంటున్నామని తెలిపారు. ఉద్యోగుల సమస్యలు, డిమాండ్ల పరిష్కారానికి ఉద్యోగుల తరఫున ఏపీ ఎన్జీవో సంఘం తన కృషిని నిరంతరం కొనసాగిస్తుందని రాష్ట్ర అధ్యక్షులు ఎ. విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డి వి రమణ స్పష్టం చేశారు.

# పేదలకు అండగా కూటమి ప్రభుత్వం

- ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, ఎమ్మెల్యే కొండబాబు



**కాకినాడ,అక్టోబర్ 1 (వార్తాప్రభ) :** ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తోందని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు స్పష్టం చేశారు. కాకినాడ నగరంలోని 38వ వార్డులో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు ) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖర్,కర్రి పద్మశ్రీ, కమిషనర్ ఎన్ వివి సత్యనారాయణలు లబ్ధిదారులకు ఎన్ టి ఆర్ భరోసా సామాజిక పెన్షన్లను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పింఛన్లను అందజేశారు. పింఛన్ అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వంపై హర్షం వ్యక్తం చేశారు. ?ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు సానా సతీష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 61 లక్షల మంది లబ్ధిదారులకు ప్రభుత్వం పింఛన్లు అందిస్తోందని, ఇందుకోసం ప్రతి నెలా సుమారు ?2,500 కోట్ల ఆర్థిక భారాన్ని ప్రభుత్వం చిరునవ్వుతో భరిస్తోందని పేర్కొన్నారు. ఒక్క కాకినాడ నగరంలోనే మొత్తం 28,544 మంది లబ్ధిదారులకు నెలకు ?12.54 కోట్ల మేర పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులే నేరుగా ఇంటింటికీ వెళ్లి పింఛన్లను అందజేస్తున్నారని తెలిపారు. లబ్ధిదారులకు పూర్తి మొత్తం సకాలంలో అందుతోందా లేదా అనేది స్వయంగా పర్యవేక్షిస్తున్నామన్నారు. కొత్త పింఛన్ల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ప్రస్తుతం ముమ్మరంగా సాగుతోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ త్వరలోనే కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, డివిజన్ ఇంచార్జి ఎవిడి మెంటారావు, టి పి ఆర్ ఓ సతీష్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వి చరణ్,తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి పరిరక్షణపై గ్రీన్ టీచర్లకు శిక్షణ




**ఉయ్యూరు,అక్టోబర్ 1 (వార్తాప్రభ) :** గుడివాడ డివిజన్ పరిధిలోని గ్రీన్ టీచర్లకు ప్రకృతి, పర్యావరణ పరిరక్షణపై ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని ఉయ్యూరులోని ఏజీకే మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి ఏపీఎన్‌జీసీ జిల్లా సమన్వయకర్త శ్రీమతి కే. కృష్ణవేణి హాజరై ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. ప్రకృతి పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత, జీవ వైవిధ్య సంరక్షణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని కృష్ణవేణి పేర్కొన్నారు. విద్యార్థుల్లో పర్యావరణ స్పృహను పెంపొందించడంతో పాటు, పాఠశాల స్థాయిలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. గుడివాడ డివిజన్ సమన్వయకర్త శ్రీమతి పి. జగతి మాట్లాడుతూ ప్రకృతి సంరక్షణను కేవలం బోధనా అంశంగా కాకుండా విద్యార్థుల రోజువారీ జీవితంలో ఆచరణలో పెట్టేలా ప్రోత్సహించాలన్నారు. ఎన్‌జీసీ కార్యక్రమాలు, పర్యావరణ విద్యా కార్యక్రమం (ఈఈపీ), ఉపాధ్యాయుల నమోదు ప్రక్రియ, ప్రకృతి కనెక్ట్ యాప్ వినియోగంపై శిక్షణ ఇచ్చారు. యాప్‌లో పర్యావరణ కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు, చిత్రాలను ఎలా నమోదు చేయాలో ప్రదర్శన ద్వారా వివరించారు. పాఠశాలల్లో విద్యార్థుల భాగస్వామ్యంతో నిర్వహించాల్సిన పర్యావరణ అవగాహన, ప్రకృతి పరిరక్షణ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణకు ఉయ్యూరు డివిజన్ పరిధిలోని వివిధ ఉన్నత పాఠశాలలకు చెందిన 50 మంది గ్రీన్ టీచర్లు హాజరయ్యారు. పాఠశాల స్థాయిలో మరిన్ని పర్యావరణ కార్యక్రమాలు చేపట్టేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు.

# స్వచ్ఛత పట్ల పిల్లలకు అవగాహన భేష్..

- శశి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ.







**తాడేపల్లిగూడెం( పిఏబి),అక్టోబర్ 1 (వార్తాప్రభ) :** మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ మై భారత్ వెస్ట్ గోదావరి ఆధ్వర్యంలో సేవా పక్వాడ కార్యక్రమాన్ని శశి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్ తాడేపల్లిగూడెం లో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో భాగంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఒ వసుంధర బ్లడ్ సెంటర్ సంయుక్తంగా లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఏలూరు ఆధ్వర్యంలో మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఏర్పాటు చేయడం జరిగిందిఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాశాల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాల్ కృష్ణ ఇలాంటి మంచి కార్యక్రమం మా కాలేజీలో నిర్వహించడం ఎంతో సంతోషకరంగా ఉందని తెలిపారు. రక్తదానం చేయడం వలన ఎన్ని మంచి ఉపయోగాలు ఉన్నాయా పిల్లలకి వివరించారు. సేవా కార్యక్రమం అంటే ముందు వరుసలో శశి కాలేజ్ ఉంటుందని అన్నారు. అనంతరం సేవా పక్వాడ కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి ఆదేశాలలో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ రెండు వరకు నిర్వహించే సేవా పక్వాడ కార్యక్రమంలో మా కళాశాల పిల్లలు భాగ్యస్వామ్యం కావడం స్వచ్ఛత పట్ల పిల్లలకి అవగాహన కల్పించడం ఎంతో ఉపయోగకరమైన విషయంగా కొనియాడారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులు అతిథులతో కలిసి స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ షేక్ బాషా కి కాలేజీ యాజమాన్యం తరఫునుంచి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ రాజశేఖర్ , లైన్స్ క్లబ్ శ్రీహరి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ విద్యార్థులు, ఎన్సిసి వాలంటీర్ పాల్గొన్నారు

# కార్మికులకు భద్రత, సైబర్ నేరాలపై అవగాహన

- భద్రతపై అప్రమత్తతతో ప్రమాదాలకు చెక్



**హనుమాన్ జంక్షన్,అక్టోబర్ 1 (వార్తాప్రభ) :** వీరవల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వీరవల్లి గ్రామంలోని కార్టన్ బాక్స్ తయారీ పరిశ్రమలో జన చైతన్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరవల్లి ఎస్సై సత్యం సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్మికులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పని ప్రదేశంలో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, భద్రతా పరికరాల వినియోగం, అప్రమత్తతపై సూచనలు చేశారు. అదేవిధంగా సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులకు స్పందించవద్దని సూచించారు. బ్యాంకు ఖాతా, ఏటీఎం, ఓటీపీ, వ్యక్తిగత వివరాలను ఇతరులకు వెల్లడించరాదని తెలిపారు. మహిళల భద్రత, అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను ఆశ్రయించే విధానం, చట్టపరమైన రక్షణ తదితర అంశాలపై కూడా అవగాహన కల్పించారు. నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, ఏదైనా అనుమానాస్పద ఘటన ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై సత్యం సురేష్ సూచించారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

## శ్రీ సాయి గౌతమ్ పాఠశాలలో మొక్కలు నాటిన బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది



**హనుమాన్ జంక్షన్,అక్టోబర్ 1 (వార్తాప్రభ) :** కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన 'ఏక్ పేడ్ మా కే నామ్' (Ek Ped Maa Ke Naam) కార్యక్రమంలో భాగంగా బాపులపాడు మండలంలోని శ్రీ సాయి గౌతమ్ ఈఎం పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా పాఠశాల ప్రాంగణంలో వివిధ రకాల మొక్కలను నాటారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా బాపులపాడు శాఖ మేనేజర్ డోలా సుధాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలని నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమంలో అంజిబాబు, వేగిరెడ్డి బాలాజీ (బీఎస్ఏ), ప్రవీణ్ (బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్), ఆరినేపల్లి రాము తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు, పాఠశాల సిబ్బంది కూడా కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఎంపీ ఆశీస్సులతో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన విస్సన్నపేట మండల టిడిపి అధ్యక్షులు రాయల సుబ్బారావు



**విస్సన్నపేట,అక్టోబర్ 1 (వార్తాప్రభ) :** స్థానిక మండల టిడిపి కార్యాలయంలో విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని ( చిన్ని) శివనాథ్ ఆశీస్సులతో 15 కుటుంబాలకు7,21,270 లక్షల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు రాయల సుబ్బారావు, మాజీ అధ్యక్షులు మట్టా వేణుగోపాలరావు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కొర్లమండ కే రాజ, జిల్లా తెలుగు మహిళ ఆర్గనైజింగ్ కార్యదర్శి నాదెళ్ల నాగమణి , రామినేని రామారావు, టిడిపి యువ నాయకులు ముత్తం శెట్టి వంశీ తదితరులు పాల్గొన్నారు. చెక్కులు పొందిన కుటుంబాలు ఎంపీ శివనాథ్ చిన్ని కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## కోనేరు ట్రాకర్ ఇరువైపులా ఫల పుష్ప ఔషధ మొక్కల ఏర్పాటుకు శ్రీకారం



**విస్సన్నపేట,అక్టోబర్ 1 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో విస్సన్నపేటకు తలమానికంగా విరాజిల్లుతున్న కోనేరు ఓపెన్ జిమ్ వాకింగ్ ట్రాకర్ శిఖలో కొత్త సొగసులు అద్దెందుకు తిరువూరు ఎఎంసి వైస్ చైర్మన్, ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు వైభవ్ జ్యూయలరీ మార్ట్ అధినేత కుక్కడపు వెంకట నాగేశ్వరరావు శ్రీకారం చుట్టారు. వాకర్స్ కు సంపూర్ణ ఆక్సిజన్ అందించే లక్ష్యంగా పల పుష్ప ఔషధ మొక్కలను అందించేందుకు పథక రచన చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. ఎంపీడీవో సిహెచ్ చిన్న రాట్నాలు, కాంట్రాక్టర్ లలితా రామకృష్ణ, ఏపీవో రామారావు, ఎస్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయం వేరు నిజ జీవితాలు వేరు



**విస్సన్నపేట,అక్టోబర్ 1 (వార్తాప్రభ) :** కులమత రాజకీయాలకు అతీతంగా ఆప్యాయత ప్రేమానురాగాలతో విలువలకు విశ్వసనీయతకు అద్దం పడుతూ పరస్పరం గౌరవించుకుంటూ విసన్నపేట మండలంలో ఏ కార్యక్రమానికైనా స్థానిక టిడిపి వైసిపి నాయకులు హాజరవ్వటం కొసమెరుపుగా చెప్పుకోవచ్చు. వివాహాది శుభకార్యాలకు విందు వినోదాలకు పరామర్శలకు చివరకు స్థానిక లక్ష్మీ వైన్స్ షాపు ప్రారంభోత్సవానికి సైతం మరపురాని మరువలేని మహోన్నతమైన సాక్ష్యంగా వైసిపి మండల పార్టీ అధ్యక్షులు ఓలేటి దుర్గారావు, మాజీ మండల టిడిపి అధ్యక్షులు మట్టా వేణుగోపాలరావు, రాష్ట్ర టిడిపి నాయకులు నెక్కలపు వెంకటేశ్వరరావు (బద్దే), మండల టిడిపి అధ్యక్షులు రాయల సుబ్బారావు వైసిపి నాయకులు అమానుల్లా తదితరులు హాజరు కావడం ఆయా రాజకీయ పార్టీల కార్యకర్తలకు ఒకే పందిరి కింద కలిసి ఉండటం మహదానందాన్ని కలిగించింది.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీలో జిల్లా ఫస్ట్ మన విస్సన్నపేట మండలం




**విస్సన్నపేట,అక్టోబర్ 1 (వార్తాప్రభ) :** స్థానిక మండలం ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీలో మొదటి స్థానంలో ఉన్నట్లు ఎంపీడీవో సిహెచ్ చిన్నరాట్నాలు తెలియజేశారు. 7920 మంది లబ్ధిదారులు మండలంలో ఉన్నారని క పింఛన్లు అందించామన్నారు. అత్యధిక శాతం పింఛన్దారులకు బట్వాడ జరిగిందంటే ఇది సమిష్టి కృషి అని ఆయన తెలియజేశారు.


దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ



SINCE: 1984
చైతన్య కాలేజ్
Cell: 93908 22625
ONE SITTING (For Discontinued)
B.Tech, M.Tech, Diploma
M.B.A, M.C.A, M.Sc, M.A.
B.A, B.Com, B.Sc, B.B.A,
U.G.C. Recog. Universities
10th & Inter TOSS / APOSS / NIOS

డైరెక్టర్: బి.వి. త్రినాథ్ M.A, M.Ed, M.Phil, L.L.B



| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 165 | ది.2-10-2026 | శుక్రవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 165 | Date : 2-10-2026 | Friday | Pages : 8 | Rs.1/- |


# డ్వాక్రా రుణంతో వ్యాపారం... వాట్సాప్‌తో విస్తరణ

- వన్ ఫ్యామిలీ--వన్ ఎంట్రప్రెన్యూర్ స్ఫూర్తితో వ్యాపారవేత్తగా రేపల్లె మహిళ
- రేపల్లెలో డ్వాక్రా మహిళ జేజమ్మతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖాముఖి
- గ్రామంలో ఓ లబ్ధిదారునికి వృద్ధాప్య పించను అందజేసిన ముఖ్యమంత్రి






**రేపల్లె,అక్టోబర్ 1 (వార్తాప్రభ) :** స్వయం సహాయక సంఘాల ద్వారా అందుతోన్న రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. డ్వాక్రా రుణాలు, ప్రభుత్వ ప్రోత్సాహంతో చిన్న వ్యాపారాలను ప్రారంభించి వాటిని క్రమంగా విస్తరించుకోవచ్చని సూచించారు. బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గంలో పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. రేపల్లెలోని 4వ వార్డులో శ్రీలక్ష్మి కిరాణా జనరల్ స్టోర్‌ను సందర్శించి దుకాణ యజమాని జి.జేజమ్మతో పాటు స్వయం సహాయక సంఘాల మహిళలతో సీఎం ముఖాముఖి మాట్లాడారు.

**రూ.2 లక్షల రుణంతో విస్తరించిన వ్యాపారం..** డ్వాక్రా రుణంతో కిరాణా దుకాణాన్ని ఏర్పాటు చేసుకుని నిర్వహిస్తున్నామని జి.శ్రీనివాసరావు, జి.జేజమ్మ దంపతులు ముఖ్యమంత్రికి వివరించారు. 2003 నుంచి పెయింటర్‌గా పనిచేస్తున్నారని శ్రీనివాసరావు వివరించారు. 2025 ఫిబ్రవరిలో రూ.1 లక్ష పెట్టుబడితో చిన్న దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్నామని, అదే ఏడాది జూన్‌లో రూ.2 లక్షల గ్రూప్ లింకేజీ రుణం లభించడంతో వ్యాపారాన్ని కొంత విస్తరించినట్లు వారు తెలిపారు. సాంకేతికతను సైతం వినియోగించుకుంటూ తమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నట్లు జెజమ్మ, శ్రీనివాసరావు తెలిపారు. స్మార్ట్‌ఫోన్లు, వాట్సాప్ ద్వారా వినియోగదారుల నుంచి ఆర్డర్లు తీసుకుంటూ నెలవారీ కిరాణా సరుకుల అవసరాలను వినియోగదారులు వాట్సాప్‌లో పంపుతుండగా, ఆర్డర్ చేసిన సరుకులను తన భర్త వారి ఇళ్లకు వెళ్లి అందజేస్తున్నట్లు జేజమ్మ తెలిపారు. ప్రభుత్వం తీసుకొచ్చిన 'వన్ ఫ్యామిలీ--వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమం తనకు ఎలా స్ఫూర్తిని ఇచ్చిందో జేజమ్మ సీఎంతో పంచుకున్నారు.

**వ్యాపార నిర్వహణపై మహిళలకు సీఎం దిశానిర్దేశం..** తమ వ్యాపార ఆలోచనలు, అనుభవాలు, భవిష్యత్ ప్రణాళికలను డ్వాక్రా మహిళలు సీఎంకు వివరించారు. వివిధ రంగాల్లో ఉన్న వ్యాపార అవకాశాలను మహిళలు అన్వేషించి స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని సీఎం చంద్రబాబు వారికి సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు వాట్సాప్ బిజినెస్‌పై ఉన్న అవగాహనను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీనివాసరావు తండ్రి వెంకటరావుకు సీఎం చంద్రబాబు వృధ్యాప్య పింఛన్‌ను అందజేశారు. అనంతరం స్వయం సహాయక సంఘాల మహిళలతో కలిసి సీఎం ఫొటో దిగారు.

# పుల్లూరు లో ఎస్ ఎం సీ ఎన్నికల్లో ఉద్రిక్తత

## మరో సారి వాయిదా పడ్డా చిలుకూరివారిగూడెం జెడ్పీ పాఠశాల ఎస్ఎంసి ఎన్నికలు

- కోరం లేకపోవడం వల్ల ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించిన జిల్లా ఉప విద్యాశాఖ అధికారి సాంబశివరావు
- ఎస్ఎంసి ఎన్నికలు వాయిదా పడటానికి రాజకీయ జోక్యం,ఇరుపార్టీల ఉద్రిక్తతలే కారణమా...?
- ఎన్నికలను బహిస్కరించిన వైసీపీ వర్గీయులు
- బెడిసికొట్టిన టీడీపీ నాయకుల వ్యూహం
- కోరం ప్రకారం 128 మంది ఓటర్లకు గాను 115 మంది మాత్రమే హాజరైన టీడీపీ వర్గీయులు
- ఎస్ఎంసి ఎన్నికల దృష్ట్యా స్కూల్ లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్న మైలవరం సీఐ కిషోర్ బాబు
- రెండోసారి ఎన్నికలు వాయిదా పడటంతో నిరాశగా వెనుదిరిగిన విద్యార్థుల తల్లిదండ్రులు
- ఎన్నిసార్లు వాయిదా వేస్తారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన పేరెంట్స్
- ఎన్నికల పర్యవేక్షకులుగా హాజరైన విజయవాడ డివైఈఓ సాంబశివరావు,తిరువూరు డివైఈఓ శ్యామ్ సుందర్











**మైలవరం (పుల్లూరు),అక్టోబర్ 1 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా,మైలవరం మండలం,పుల్లూరు గ్రామ శివారు చిలుకూరు వారిగూడెం గ్రామంలోని అప్పిడి సుబ్బారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ (రావీజ) ఎన్నికలు మరోసారి వాయిదా పడ్డాయి. సెప్టెంబర్ 29, 2026న స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించే క్రమం లో కోరం లేకపోవడంతో ఎన్నికల నిర్వహకులు వాయిదా వేశారు.అయితే ఈనెల అనగా అక్టోబర్ 1, 2026 న మరోసారి ఎస్ఎంసి ఎన్నిక లు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమయ్యింది.ఎన్నికల నిర్వహణ జెడ్.నరసిం హారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టాగా ఎన్నికల పర్యవేక్ష కులుగా విజయవాడ డివైఈఓ డి.సాంబశివ రావు,తిరువూరు డివైఈఓ ఎ.శ్యామ్ సుందర్ హాజరయ్యారు.చిలుకూరు వారిగూడెం గ్రామం లోని అప్పిడి సుబ్బారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసి ఎన్నికలకు సంబంధించి పేరెంట్స్ ఓట్లు మె-ుత్తం 254 ఉన్నాయి.ఎన్నికల నిర్వహణకు ముందు అధికారులు పేరెంట్స్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించారు.పేరెంట్స్ ఓట్లు 254 కి గాను 217 మంది రిజిస్టర్ అయ్యారు.వీరిలో కొంతమంది పేరెంట్స్ రిజిస్టర్ అయ్యి కూడా ఓటింగ్ లో పాల్గొనకుండా వెళ్ళిపోయారు. మరి కొంతమంది ఓటింగ్ కు సిద్ధమయ్యారు.

**కోరం లేకపోవడంతో మరోసారి వాయిదా పడ్డా ఎన్నికలు:** ఓటింగ్ నిర్వహించేందుకు కోరం ప్రకారం 254 మంది ఓటర్స్ లలో సగం మంది అనగా 128 మంది ఓటర్స్ హాజరు కావాల్సి ఉంది. అయితే 115 మంది పేరెంట్స్ మాత్రమే ఓటింగ్ కు హాజరయ్యారు.దీంతో కావలసిన కోరం లేకపోవడంతో ఎన్నికల పర్యవేక్షకులు సాంబశివ రావు, శ్యాంసుందర్ ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.దీంతో ఓటింగ్ కు హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు ఒక్కసారిగా కోపద్రేకులు అయ్యారు.ఎన్నిసార్లు వాయిదా వేస్తారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. కావాలనే వాయిదా వేశారని, ఎన్నికలు నిర్వహించే వరకు అధికారులను బయటికి పంపించేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు.

**దీంతో అక్కడే ఉన్న మైలవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ ..** కె.కిషోర్ బాబు పేరెంట్స్ కి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.మైలవరం, జి.కొండూరు,రెడ్డిగూడెం ఎస్సై లు, పోలీస్ సిబ్బంది తో కలిసి సీఐ కిషోర్ బాబు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకు న్నారు.సామరస్యంగా జరగాల్సిన ఈ ఎన్నికలు రాజకీయ జోక్యం చోటు చేసుకుంది.

**రాజకీయ జోక్యం.....దారితీసిన ఉద్రిక్తతలు:** రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు రాజకీయాలకు అతీతంగా జరగాల్సిన ఎస్ఎంసి ఎన్నికలు స్థానిక టీడీపీ, వైసిపి నాయకుల జోక్యంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదానికి దారి తీసింది.మైలవరం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ (రావీజ) ఎన్నికలు ప్రశాంతంగా జరగగా...పుల్లూరు గ్రామ శివారు చిలుకూరు వారిగూడెం గ్రామంలోని అప్పిడి సుబ్బారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ (రావీజ) ఎన్నికలను టీడీపీ మరియు వైసీపీ నాయకులు ఒక ఛాలెంజ్ గా తీసుకున్నారు.దీంతో పాఠశాల లో ఎస్ఎంసి ఎన్నికల్ ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది.ఎస్ఎంసి చైర్మన్ పదవి తమ వర్గానికి దక్కాలని టీడీపీ నాయకులు,కాదు మా వర్గానికే దక్కాలని వైసీపీ నాయకులు పట్టుబట్టా రు.ఎన్నికల ప్రక్రియలో అధికార యంత్రాంగం స్థానిక టీడీపీ నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తుండగా, తమ వర్గానికే ఎక్కువ ఓటింగ్ ఉందని అయినా కావాలనే అధికారులు ఎన్నికలు వాయిదా వేస్తున్నారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. అయితే అధికారులు మాత్రం నిబంధనల ప్రకారమే తాము ముందుకు వెళ్తున్నామని, కోరం సరిపోకనే ఎన్నికలు వాయిదా వేయాల్సి వస్తుందని వెల్లడించారు.ఎన్నికల సందర్భంగా ఇరువర్గాల మధ్య పరిస్థితి ఉద్రిక్తంగా మారడం తో పోలీసులు రంగంలోకి దిగారు.సీఐ కిషోర్ బాబు ఆధ్వర్యంలో ఎస్ఐ లు కె. సుధాకర్, కె.సతీష్ కుమార్, సిబ్బంది ఇరువర్గాలను శాంతింపజేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చా రు.రెండోసారి కూడా ఎన్నికలు వాయిదా పడటంతో ఓటింగ్ కు వచ్చిన తల్లిదండ్రులు నిరాశగా వెనుదిరిగారు.

**బెడిసికొట్టిన టీడీపీ నాయకుల వ్యూహం:** ఈసారి ఎలాగైనా ఓటింగ్ జరిపించి తమ వర్గానికి చెందిన వారిని ఎస్ఎంసి చైర్మన్ గా పెట్టాలని టీడీపీ నాయకుల వ్యూహం బెడిసికొట్టింది ఫలించలేదు.కోరానికి సరిపడా ఓటర్లను సమీకరించడంలో టీడీపీ నాయకులు తీవ్రంగా కృషి చేసినప్పటికీ వారి వ్యూహాత్మక చర్యలు ఫలించలేదని స్థానికులు వాపోయారు.

# 30 మంది చిన్నారులతో స్కూల్ బస్సు బోల్తా

- ముగ్గురు చిన్నారులకు తీవ్ర గాయాలు..
- మరో ఇద్దరికి గాయాలు
- నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలింపు..
- మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలింపు



**ఆగిరిపల్లి,అక్టోబర్ 1 (వార్తాప్రభ) :** ఏలూరు జిల్లా ఆగిరిపల్లి పరిధిలో గురువారం ఉదయం స్కూల్ బస్సు బోల్తా పడిన ఘటన కలకలం రేపింది. నూజివీడు పట్టణంలోని బీఐఎస్ పాఠశాలకు చెందిన బస్సు ఆగిరిపల్లి చుట్టుపక్కల గ్రామాల నుంచి సుమారు 30 మంది విద్యార్థులను పాఠశాలకు తీసుకువెళ్తుండగా వడ్లమాను గ్రామం వద్ద ప్రమాదానికి గురైంది. ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయే క్రమంలో బస్సు అదుపుతప్పి బైక్‌ను ఢీకొని బోల్తా పడినట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే గ్రామస్తులు హుటాహుటిన అక్కడికి చేరుకుని బస్సులో చిక్కుకున్న చిన్నారులను బయటకు తీసేందుకు సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనలో ముగ్గురు చిన్నారులకు తీవ్ర గాయాలు కాగా, బస్సు ఢీకొన్న వాహనంలో ఉన్న ఇద్దరు వ్యక్తులకు కూడా తీవ్ర గాయాలైనట్లు సమాచారం. గాయపడిన వారందరినీ నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉన్న వారిని మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించినట్లు తెలిసింది. బైక్‌పై ప్రయాణిస్తున్న వారి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాద విషయం తెలుసుకున్న రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి స్పందించి, గాయపడిన వారందరికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించినట్లు సమాచారం. గాయపడిన వారి పరిస్థితిని వైద్య సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

**The Court of the Motor Accidents Claims Tribunal Cum VIII Addl District Judge at Vijayawada**

MVOP No.130/2023

Between :
A.Durga Sai Deepak
--------Petitioner
And
G.Ramanjaneyalu
And 2 Others
--------Respondents

**SUBSTITUTE - SERVICE OF SUMMONS**

Respondant No1 :- Gunja Ramanjaneyulu S/o Subba Rao R/o Kanaka Durga Nagar, 4th line, Boyana Bapuji Street, Patamata, Vijayawada .
Rider of Two Wheeler bearing No. AP16CL0517

పై నెంబరు M.V.O.P. లో మొదటి రెస్పాండెంట్ అయిన మీకు పై M.V.O.P. సమన్లు పంపగా తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ పేపరు ప్రకటన ద్వారా సదరు M.V.O.P. సంగతులు తెలియచేయవలసినదిగా శ్రీ పై కోర్టు వారు ఆదేశించి యున్నారు. కావున తేది 12-10-2026వ తేదిన ఉదయం 10.30గం॥లకు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేదా మీ న్యాయవాది గారి ద్వారా గాని హాజరై మీ యొక్క అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించెదరని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

**(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)**
**వాయిదా తేది : 12-10-2026**

ఇట్లు
**V.RAYAPPA,** B.A., B.L.,
Advocate
RCM Church Road,
Mogalrajpuram,
Vijayawada-520 010
Vijayawada
25-09-2026

**IN THE COURT OF THE II ADDITIONAL CIVIL JUDGE (JUNIOR DIVISION) : AT VIJAYAWADA.**

O.S.No.1189/2023

Between:
State Bank of India, S.M.E. Centre, Represented by Chief Manager, Suryaraopeta, Vijayawada-2.
-------Plaintiff
And
M/s. Venkata Ratna Diesel Services, Represented by its Proprietor, Ratna Rao Chilakalapudi, Vijayawada.
-------Defendant

**Address :** D.No.27-30-10/1, Akulavari Street, Governorpet, Vijayawada-520002.

పై నెంబరు దావాలోని ప్రతివాది కి దావా సమన్లు శ్రీ కోర్టు వారు పబ్లికేషన్ ద్వారా ఆర్డర్ వేసి యున్నారు. కావున సదరు ప్రతివాది అయిన వెంకట రత్నా డీజిల్ సర్వీసెస్, ప్రొప్రైటర్ రత్నా రావు చిలకలపూడి, ది.08-10-2026 వ తేదీన ఉదయం గం 10.30 నిమిషాలకు శ్రీ కోర్టు వారి ముందు ప్రత్యక్షంగా గానీ లేదా వకీల్ ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనగలరు. లేని యెడల మీ పరోక్షమునందు తీర్మానించబడునని తెలియపరచడమైనది.

**(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)**
**వాయిదా: 08-10-2026**

ఇట్లు :
**V.Raja Suresh**
Advocate,
D.No. 41-18-53, Krishnalanka,
Vijayawada-13,
Cell:9346221022

**IN THE COURT OF THE I ADDITIONAL CIVIL JUDGE (JUNIOR DIVISION) : AT VIJAYAWADA.**

O.S.No.660/2023

Between:
State Bank of India, Retail Assets Central Processing Centre (RACPC-1), SAR Wing, Rep. by its Chief Manager, Vijayawada
-------Plaintiff
And
Tadepalli Radhika
Prop: Sai Padmavathi Auto Agencies
-------Defendant

**Address :** Door No. 11-49/3, K.V.R. Colony, Enikepadu, Vijayawada Rural, N.T.R. District-521108.

పై నెంబరు దావాలోని ప్రతివాది కి దావా సమన్లు శ్రీ కోర్టు వారు పబ్లికేషన్ ద్వారా ఆర్డర్ వేసి యున్నారు. కావున సదరు ప్రతివాది అయిన తాడేపల్లి రాధికా, ప్రొప్రయిటర్ సాయి పద్మావతి ఆటో ఏజెన్సీలు, ది. 11-11-2026 వ తేదీన ఉదయం గం 10.30 నిమిషాలకు శ్రీ కోర్టు వారి ముందు ప్రత్యక్షంగా గానీ లేదా వకీల్ ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనగలరు. లేని యెడల మీ పరోక్షమునందు తీర్మానించబడునని తెలియపరచడమైనది.

**(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)**
**వాయిదా: 11-11-2026**

ఇట్లు :
**V.Raja Suresh**
Advocate,
D.No. 41-18-53, Krishnalanka,
Vijayawada-13,
Cell:9346221022

**మహారాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు - మచిలీపట్నం**

ఇ.పి. 82 / 23 - ఒ.ఎస్ 247/23

బిట్వీన్ :
ముత్యాలపల్లి కృష్ణమూర్తి
------డి. హెచ్.ఆర్
అండ్
ముత్యాలపల్లి వెంకట నాగ గణేష్ తండ్రి. వేణుగోపాలరావు
డోర్.నెం. 8-3-228/678/1412
శ్రీరామ్‌నగర్, యూసఫ్‌గూడ, హైదరాబాద్.
------ జె.డి.ఆర్.

పై నెంబరు ఇపి 82/23 - ఒ.ఎస్. 247/23లో జె.డిఆర్ / ప్రతివాది అయిన మీకు నోటీసులు అమలు నిమిత్తం ది.07-10-2026నకు వాయిదా అయి ఉన్నది. కావున సదరు వాయిదా రోజున ఉదయం 10 :30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా గానీ లేదా న్యాయవాది ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల మీ పరోక్షమున తదుపరి గ్రంధములు జరిపించబడునని ఇందు మూలముగా తెలియజేయటమైనది.

**శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము**
**వాయిదా తేది: 07-10-2026.**

ఇట్లు :
**వై.వి. నాగభూషణరావు**
**ఎస్.గోవర్ధనమ్మ, బి. కరుణ**
వాది తరపు న్యాయవాదులు
మచిలీపట్నం,
సెల్: 9866635657

# రాయలసీమ దశ-దిశ
## మార్చేలా గ్లోబల్ హార్టికల్చర్ హబ్

- కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా పనులకు అంకురార్పణ

**అమరావతి, అక్టోబర్ 1 (వార్తాప్రభ) :** రాయలసీమ ప్రాంతాన్ని ఫ్రూట్ బౌల్ గా తీర్చిదిద్దేలా గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. విత్తనం నుంచి విదేశాలకు ఉద్యాన ఉత్పత్తులు ఎగుమతి చేసే వరకు రైతులకు అండగా నిలిచేలా ప్రణాళికాబద్ధంగా గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టుకు కూటమి ప్రభుత్వం రూపకల్పన చేసింది. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ తో కలిసి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లు హార్టీకల్చర్ హబ్ కు శ్రీకారం చుట్టనున్నారు. రూ.1 లక్ష కోట్ల వ్యయంతో మూడు దశల్లో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఆవిష్కృతమయ్యేలా పనులు చేపట్టనున్నారు. ఇందులో ఎన్డీఏ ప్రభుత్వం రూ.40,352 కోట్లు సమకూరుస్తుండగా, ప్రైవేట్ రంగం నుంచి రూ.60,000 కోట్లు పెట్టుబడులు రాబట్టేలా ప్రణాళికలు రూపొందించారు. అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు, కర్నూలు, నంద్యాల, సత్యసాయి, తిరుపతి, కడప, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో ఈ ప్రాజెక్టు కింద వివిధ పనులను చేపట్టనున్నారు.

# బహిరంగ వేలం పేపరు ప్రకటన

**గ్రామపంచాయితీ కార్యాలయం, తరకటూరు.**

కృష్ణాజిల్లా గూడూరు మండలం తరకటూరు గ్రామపంచాయతీ పరిధిలో యావన్మంది ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది.06-10-2026వ తేదీ మంగళవారం ఉదయం గం.11:00 గంటలకు గ్రామపంచాయితీ కార్యాలయం వద్ద ప్రత్యేక అధికారి శ్రీమతి బి.రాజేశ్వరి గారి అధ్యక్షతన 2026-2027 to 2027-2028 సం॥ అనగా (2) రెండు సంవత్సరాలకు గాను ఈ క్రింది తెలిపిన 6 చేపల చెరువులకు బహిరంగ వేలం పాటలు నిర్వహించబడును. కావున ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొను ముందుగా ధరావత్తు రుసుము రూ.20,000/- చెల్లించి బహిరంగ వేలం పాటలో పాల్గొనవలసినదిగా తెలియజేయడమైనది.

| S No. | చెరువు పేరు | పాట కాలం | ధరవత్తు |
|---|---|---|---|
| 1 | కొత్త చెరువు | 2026-27 to 2027-28 | 20000.00 |
| 2 | చింతలమ్మ చెరువు | 2026-27 to 2027-28 | 20000.00 |
| 3 | కొంపలాని చెరువు | 2026-27 to 2027-28 | 20000.00 |
| 4 | చేదాయి చెరువు | 2026-27 to 2027-28 | 20000.00 |
| 5 | మట్ట చెరువు పర్కాల | 2026-27 to 2027-28 | 20000.00 |
| 6 | పాతం చెరువు | 2026-27 to 2027-28 | 20000.00 |

నోట్

5. గ్రామపంచాయితీకి ఏ విధమైన బకాయిలు ఉన్న వారు సదరు వేలం పాటలో పాల్గొనరాదు
6. తదుపరి విషయలు కొరకు గ్రామ పంచాయతీ కార్యాలయం పని వేళలో అడిగి తెలుసుకొనగలరు .

**ఇందుకూరి దుర్గా గంగ రాజు**
కార్యదర్శి
గ్రామ పంచాయితీ, తరకటూరు
గూడూరు మండలం, కృష్ణాజిల్లా

# సంపాదకీయం

## అమెరికా 'గ్రీన్ కార్డ్' కల పై మరో 'భారీ' పిడుగు..

ఏళ్ల తరబడి నిరీక్షించిన రాత్రులకు రేపటి రోజునైనా వెలుగు వస్తుందేమోనని కళ్లల్లో ఒత్తులేసుకుని చూస్తున్న ఎన్నారై అభాగ్యులకు, ఇమ్మిగ్రేషన్ విభాగం తీసుకున్న దారుణ నిర్ణయాలు గుండెల్లో కోలుకోలేని గాయాన్ని మిగిల్చాయి. ఒకవైపు నింగినంటే ఫీజుల మోతతో ఆస్తులు కరిగిపోతుంటే.. మరోవైపు కదలకుండా పాతాళంలో నిలిచిపోయిన వీసా తేదీలు విదేశీ గడ్డపై భారతీయులను అభద్రతాభావం అనే బానిస సంకెళ్లలోకి తోసివేస్తున్నాయి... అమెరికా వీధుల్లో స్వేచ్ఛగా అడుగుపెట్టాలని.. కష్టపడి సంపాదించుకున్న నైపుణ్యంతో అక్కడ శాశ్వత నివాసం గ్రీన్ కార్డ్ ఏర్పాటు చేసుకోవాలని కలలుకనే వేలాది మంది భారతీయులకు అక్టోబర్ 2026 తీవ్ర నిరాశను.. ఆందోళనను మోసుకొచ్చింది. దశాబ్దాలుగా రేపటి వెలుగుల కోసం నిరీక్షిస్తున్న అభాగ్యులకు ఇమ్మిగ్రేషన్ విభాగం సవరించిన నిర్ణయాలు కోలుకోలేని దెబ్బ తీశాయి. ఒకవైపు ఆర్థికంగా కుంగదీసే భారీ ఫీజుల పెంపు.. మరోవైపు ఏళ్ల తరబడి కళ్లల్లో ఒత్తులు వేసుకుని చూస్తున్న ప్రాధాన్యత తేదీల నిలిచివేత భారతీయ కుటుంబాల గుండెల్లో తీవ్ర గుబులు రేపుతున్నాయి. ధనవంతులు, పారిశ్రామికవేత్తలు పెట్టుబడుల ద్వారా గ్రీన్ కార్డ్ పొందేలా ప్రోత్సహించే ఈబీ-5 ప్రోగ్రామ్‌కు ఇమ్మిగ్రేషన్ సేవల సంస్థ (యూఎస్.సీఐఎస్) భారీగా ఫీజులు పెంచి నవంబర్ 30 నుంచి అమలు చేయనుంది. ప్రత్యక్ష పెట్టుబడిదారులకు సంబంధించిన ఫారం ఐ-526 ఫీజు ప్రస్తుతం ఉన్న 3,675 డాలర్ల నుంచి ఒక్కసారిగా 7,615 డాలర్లకు పెరగగా.. రీజినల్ సెంటర్ ద్వారా దరఖాస్తు చేసే ఫారం ఐ-526ఈ ఫీజు 7,850 డాలర్లకు చేరింది. రీజినల్ సెంటర్లకు చెందిన ఫారం ఐ-956 ఫీజు 17,795 డాలర్ల నుంచి ఏకంగా 44,115 డాలర్లకు.. ఫారం ఐ-956ఎఫ్ ఫీజు 42,675 డాలర్లకు ఆకాశాన్ని తాకాయి. ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులను అమెరికా ప్రాజెక్టుల్లో పెట్టుబడిగా పెడుతూ ఉద్యోగాలు సృష్టిస్తున్న భారతీయ పెట్టుబడిదారులకు.. ఈ అదనపు టెక్నాలజీ ఇంటిగ్రిటీ రుసుములు మోయలేని భారాన్ని మిగిల్చాయి. మరోవైపు అత్యంత ప్రతిభావంతులైన ఉద్యోగులు ఆశలు పెట్టుకున్న ఈబీ-2 కేటగిరీ పరిస్థితి మరింత కరుణాజనకంగా మారింది. అక్టోబర్ వీసా బులెటిన్ ప్రకారం ప్రపంచంలోని ఇతర దేశాలకు ఫైనల్ యాక్షన్ డేట్ జనవరి 1, 2025 కి వెనక్కి వెళ్లగా.. భారత్‌కి మాత్రం ఫైనల్ యాక్షన్ డేట్ నవంబర్ 1, 2013 వద్ద.. ఫైలింగ్ డేట్ జనవరి 15, 2015 వద్దే పాతాళంలా కదలకుండా ఉండిపోయాయి. దీనివల్ల ఇతర దేశాల్లో వచ్చిన మార్పుల ప్రభావం పడి భారతీయులకు దక్కాల్సిన అదనపు వీసాల ప్రయోజనం కూడా పూర్తిగా ఆవిరైపోయింది. ఈ ఘోర పరిణామాలతో పదేళ్లకు పైగా వర్క్ పర్మిట్లు, ప్రయాణ అనుమతుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న వేలాదిమంది భారతీయుల ఆశలు అడియాసలయ్యాయి. సొంత ఊరిలో కన్నవారికి అత్యవసర పరిస్థితి వచ్చినా స్వదేశానికి వెళ్లలేని బానిస బతుకులు బతుకుతున్నామని సోషల్ మీడియా వేదికల్లో బాధితులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇక్కడ ఉద్యోగ భద్రత లేక.. వీసా ముందుకు కదలంగా విసిగిపోయిన కొందరు భారతీయులు మనసు మార్చుకుని కెనడా వైపు అడుగులు వేయడానికి సిద్ధమవుతున్నారు. డబ్బులు ఉన్నవారికి ఫీజుల మోత.. కష్టపడే ఉద్యోగులకు ఏళ్ల తరబడి నిరీక్షణ నడుమ అమెరికా కల ఒక తీరని వేదనగా మారుతోంది.

## స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా రాజీవ్ గాంధీ పార్కులో 'ఏక్ గంట ఏక్ సాథ్' కార్యక్రమం




**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 1 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం రాజీవ్ గాంధీ పార్కులో 'ఏక్ గంట ఏక్ సాథ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, నగరపాలక సంస్థ సిబ్బంది సమిష్టిగా పాల్గొని ఒక గంట పాటు పార్కు ప్రాంగణంలో విస్తృతంగా పారిశుద్ధ్య కార్యక్రమాన్ని చేపట్టారు. పార్కులోని పరిసరాలను శుభ్రపరచి, చెత్తాచెదారాన్ని తొలగించి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. ప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన పెంపొందించడంతో పాటు పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలని ఈ కార్యక్రమం ద్వారా సందేశాన్ని అందించారు. పరిశుభ్రమైన నగర నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవాడ నగరాన్ని పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని నగరపాలక సంస్థ అధికారులు సూచించారు.

## నేడు గాంధీపర్వత సందర్శన ఉచితం

**విజయవాడ పశ్చిమ అక్టోబరు 1:(వార్త ప్రభ ప్రతినిధి)** జాతిపిత మహాత్మాగాంధీ 157వ జయంతి సందర్భంగా స్థానిక గాంధీ పర్వతాన్ని అందరూ ఉచితంగా సందర్శించవచ్చని గాంధీ హిల్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ పి.సి.కె గాంధీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం గం. 10 గంటల నుంచి రాత్రి గం. 08.30 వరకు మాత్రమే ఉచిత సందర్శనకు అనుమతి ఇస్తామని తెలిపారు. ఉదయం గం. 10.00 ల నుంచి ప్రతి గంటకు ప్లానిటోరియం ప్రదర్శన ఉంటుందని, ఈ ప్రదర్శనను కూడా విద్యార్థులు శుక్రవారం ఉచితంగా చూడవచ్చని పేర్కొన్నారు. సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్ ఆధ్వర్యంలో మొక్కల పెంపకం, హోమ్ కంపోస్ట్ తయారీ గురించి ప్రత్యక్ష ప్రదర్శన ఉంటాయన్నారు. కూరగాయలు, పండ్లతో గాంధీజీ కళాకృతుల ప్రదర్శన, టెర్రస్ గార్డెన్స్ లో పెంచుతున్న కూరలు, పండ్ల మొక్కల ప్రదర్శన, పాత వస్తువులతో తయారుచేసిన కళాత్మక వస్తువుల ప్రదర్శన ప్రత్యేకంగా ఏర్పాటుచేసినట్లు చెప్పారు. శుక్రవారం ఉదయం గం. 08.30 ల నుంచి గాంధీజయంతి కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు ఇస్తామన్నారు. పాఠశాలలు, కళాశాలల నుంచి విద్యార్థులు, యువత ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

# నిజాయితీ గల కమ్యూనిస్టు కామ్రేడ్ రెడపొంగు యాకోబును కోల్పోవడం బాధాకరం! ... జి.ఈశ్వరయ్య





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 1 :(వార్త ప్రభ ప్రతినిధి)** నిజాయితీ కి నిదర్శనంగా నిలిచిన భారత కమ్యూనిస్టు పార్టీ, విజయవాడ నగర సమితి సీనియర్ నాయకుడు కామ్రేడ్ రెడపొంగు యాకోబు(81) ని కోల్పోవడం నగర కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య అన్నారు. గత ఉదయం 7 గంటల తుది శ్వాస విడిచిన యాకోబు స్వగృహానికి చేరుకొని అయన భౌతికకాయానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య, నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు లు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భముగా ఈశ్వరయ్య మాట్లాడుతూ కామ్రేడ్ రెడపొంగు యాకోబు విజయవాడ నగర కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలైన కామ్రేడ్ తమ్మిన పోతరాజు, ఉప్పలపాటి రామచంద్రరావు స్ఫూర్తితో యువజన సమాఖ్య కార్యకర్తగా, యువజన నాయకుడిగా అనేక యువజన ఉద్యమాలలో ఎంతో చురుకైన పాత్రపోషించి స్థానిక అనేక మంది యువకులను సమీకరించి కమ్యూనిస్టు ఉద్యమం వైపు ఆకర్షితులను చేయడమే కాకుండా స్థానిక యువతను జనసేవాదళ్ క్యాంపులకు హాజరైయ్యేవిధంగా ప్రోత్సాహం అందించడమే కాకుండా పార్టీ సభ్యునిగా సంఘవిద్రోహ శక్తుల నుండి స్థానిక ప్రజలకు పెట్టానికి కోటగా నిలిచినా ధీరోద్ధాతుడు. స్థానిక నాయకులు నరసింహరాజు మరియు ఆర్.ఐజాక్ ల సహకారంతో అప్పటి 4వ డివిజన్ శాఖ కార్యదర్శిగా బాధ్యతలను తీసుకోని ఆనాటి నుండి స్థానికంగా డివిజన్ పార్టీ బలోపేతానికి మరియు డివిజన్ అభివృద్ధికి ఎంత-గానో కృషి చేసారు. డివిజన్ కార్యదర్శిగానే కాకుండా నగర పార్టీ కార్యవర్గ సభ్యునిగా టైనర్ పేట అభివృద్ధికి, టైనర్ పేట ప్రాథమిక పాఠశాలను ఉన్నత పాఠశాలగా మార్చడంలో ఎంతో కీలకంగా వ్యవహరిచారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లపుడు ప్రజలకు అందుబాటులో ఉండటంమీ మార్గంగా భావించి నిరంతరం ప్రజలతో మమేకమై స్థానికంగా కమ్యూనిస్టు పార్టీని ప్రజలకు మరింత చేరువ చేసి ఆనాటి 4వ డివిజన్ కార్పొరేటర్లగా తాజ్ నోస్ దాస్, గండు సావిత్రమ్మ , డి.వి.రమణబాబు అంతేకాకుండా పశ్చిమ నియోజక శాసన సభ్యులుగా ఉప్పలపాటి రామచంద్రరాజు, కాకర్లపూడి సుబ్బరాజు, షైక్ నాజర్ వలి లు గెలుపొందడంలో అయన ఎంతో కీలకపాత్ర పోషించడమే కాకుండా నిరంతరం ప్రజా సమస్యలను వారి దృష్టికి తీసుకొనే వెళ్లి సమస్యల పరిష్కారానికి అహర్నిశలు తాపత్రేపడిన గొప్ప నాయకుడని అన్నారు. నగర పార్టీ కోశాధికారిగా సుదీర్ఘ కాలం పనిచేసి తన బాధ్యతలను ఎంతో సమర్థవంతంగా నిర్వర్తించిన తన పదవికే వన్నె తెచ్చిన నాయకుడు. వృత్తి రీత్యా మున్సిపల్ ఎంప్లాయి అయిన కామ్రేడ్ యాకోబు ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నగర ఉపాధ్యక్షునిగా, మున్సిపల్ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ గా మున్సిపల్ కార్మికులకు సేవలు అందించిన గొప్ప నాయకుడు. తనకు పార్టీ ఏ బాధ్యత అప్పగించిన తూచా తప్పకుండ ఎంతో క్రమశిక్షణతో సమర్థవంతముగా తన బాధ్యతలను నిర్వహించిన గొప్ప నాయకుని కోల్పవడం విజయవాడ నగర పార్టీకి తీరనిలోటు అని అన్నారు. అటువంటి నాయకుని స్ఫూర్తితో పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీ బలోపేతానికి కృషి చేయడమే మనం ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. కామ్రేడ్ రెడపొంగు యాకోబు కు నివాళులు అర్పించిన వారిలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పెనుమత్స దుర్గాభవాని, నగర సహాయ కార్యదర్శి నక్క వీరభద్రరావు, కార్యదర్శివర్గ సభ్యులు మూలి సాంబశివరావు, బుట్టి రాయప్ప, పంచదార్ల దుర్గాంబ,తాడి పైడయ్య, అప్పూరుబోతు రాము, కొట్టు రమణారావు, కార్యవర్గ సభ్యులు డి.వి.రమణ బాబు, తూనం వీరయ్య, దోనెపూడి సూరిబాబు, బుద్దే రాజా, దుగ్గిరాల సీతారావమ్మ, సిపిఎం నాయకులు సిహెచ్ బాబురావు, సత్తిబాబు, టిడిపి నాయకుడు నాగోతి రామారావ, మల్లెపు సురేష్, వైసిపి నాయకులు కూరాకుల నాగు, ఐత క్రిష్ణ కిషోర్, జనసేన నాయకులు వేంపల్లి గౌరీశంకర్, ఎంఆర్పిఎస్ నాయకులు కోడే వంశి, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు ఆర్.పిచ్చయ్య, ఎస్.కె.నజీర్, స్థానిక డివిజన్ పార్టీ కార్యదర్శి ఆర్.ప్రభుదాస్, పి.తాతారావు, కరోతి వెంకటేశ్వరరావు, టి.పూర్ణయ్య, కుర్ర శివకుమార్, బోరా రామకృష్ణ , మోకా దుర్గారావు, పగిడికత్తుల రాము, రాయన గుర్నాథం, ఎస్.కె.బాషా,కాళ్ళ చిన్నప్ప, నగర నాయకులు కె.ఆర్.ఆంజనేయులు, చీర్ల రామస్వామి, బెవర శ్రీను, దుర్గాసి రవణమ్మ, యర్రసాని జోసఫ్, ఆర్.మైకేల్ మరియు వివిధ పార్టీల స్థానిక నాయకులు, స్థానిక పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున అయన అంతిమ యాత్రలో పాల్గొని నివాళులు అర్పించారు.

## పరిశ్రమలు, ఆతిథ్యరంగాల్లో రోబోల పాత్ర కీలకం





**విజయవాడ పశ్చిమ అక్టోబరు 1 : (వార్త ప్రభ ప్రతినిధి)** ఇప్పటికే పలు రంగాల్లో రోబోలు ప్రవేశించి వివిధ పనులు నిర్వహిస్తున్నాయని, రాబోయే రోజుల్లో పరిశ్రమలు, ఆతిథ్యం, వైద్యరంగాల్లో రోబోల పాత్ర అత్యంత కీలకం కానున్నదని ఎడ్యుబోటిక్స్ టెక్ అండ్ బిజినెస్ మేనేజర్ కె. సందీప్ అన్నారు. కెబిఎన్ కళాశాల ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఏఐ అండ్ హ్యూమనాయిడ్ రోబోటిక్స్ వర్క్ షాప్ గురువారం ముగిసింది. రెండు రోజుల పాటు జరిగిన శిక్షణ పూర్వక ప్రయోగ కార్యక్రమంలో విషయ నిపుణుడిగా పాల్గొన్న సందీప్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, పైథాన్ ప్రోగ్రామింగ్, హ్యూమనాయిడ్ రోబోటిక్స్, కంప్యూటర్ విజన్, ఇంటెలిజెంట్ ఆటోమేషన్ రంగాల్లో ప్రాయోగిక పరిజ్ఞానాన్ని కల్పించారు. హ్యూమనాయిడ్ రోబోటిక్స్‌లో ఉపయోగించే హార్డ్‌వేర్, పైథాన్ ప్రోగ్రామింగ్, బ్లాక్ కోడింగ్, రోబోట్ మూవ్‌మెంట్, సర్వో కంట్రోల్ వంటి అంశాలపై విద్యార్థులకు ప్రత్యక్ష శిక్షణ అందించారు. బోనిక్‌బాట్ హ్యూమనాయిడ్ రోబోట్, పైథాన్ ఎస్.డి.కె పరిచయంతో పాటు రోబోట్‌ను సెటప్ చేయడం, కాన్ఫిగర్ చేయడం, చక్రాలు, చేతులు, తల వంటి భాగాలను నియంత్రించడం వంటి అంశాల్లో విద్యార్థులు స్వయంగా ప్రయోగపూర్వక అనుభవం పొందారు. కంప్యూటర్ విజన్‌ను రోబోటిక్స్‌లో ఎలా అన్వయించవచ్చో సందీప్ ప్రయోగ పూర్వకంగా విద్యార్థులకు వివరించారు. భవిష్యత్తులో రోబోటిక్స్ రంగాల్లో ఉన్న పరిశోధన, ఉద్యోగ, ప్రాజెక్ట్ అవకాశాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కృష్ణవేణి మాట్లాడుతూ ఈ వర్క్ షాప్ విద్యార్థుల్లో ప్రోగ్రామింగ్, సమస్య పరిష్కారం, టీమ్‌వర్క్, ప్రాజెక్ట్ అభివృద్ధి నైపుణ్యాలను పెంపొందించేందుకు దోహదపడుతుందన్నారు. ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్. ఉదయ్ కుమార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎలక్ట్రానిక్స్ లెక్చరర్ మహమ్మద్ షోయబ్ ఇస్మాయిల్తో పాటు విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.

## గౌరవప్రదమైన జీవనానికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 1 :వార్త ప్రభ ప్రతినిధి** విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని పటమట, రెల్లిస్ కాలనీలో గురువారం ఉదయం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్, తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామ్మోహన్, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేసినేని శివనాథ్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎల్లప్పుడూ పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీతో పాటు, వారు గౌరవప్రదమైన జీవనం సాగించేందుకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. ప్రతి ఒక్కరు గౌరవంగా జీవించడం కొరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందజేస్తున్నట్లు తెలిపారు. తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ, తూర్పు నియోజకవర్గంలో ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను చురుగ్గా చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఒకవైపు సంక్షేమానికి, మరోవైపు అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలను అందించడంతో పాటు, నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ మాట్లాడుతూ, విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. మధ్యాహ్నం నాలుగు గంటల వరకు, సర్కిల్ వన్ పరిధిలో 19,613 పెన్షన్ లకు గాను 18,355, సర్కిల్ 2 పరిధిలో 25,007 పెన్షన్ లకు గాను 23,316, సర్కిల్ 3 పరిధిలో 19,750 పెన్షన్ లకు గాను 18,254, మూడు సర్కిల్స్ పరిధిలో మొత్తం 64,370 పెన్షన్ లకు 59,925 పెన్షన్ల పంపిణీ చేశారని, నగరంలోని తూర్పు, సెంట్రల్, పశ్చిమ నియోజకవర్గాల వారీగా పెన్షన్ల పంపిణీ వివరాలను వెల్లడిస్తూ, ఇప్పటివరకు మొత్తం 93 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తయిందని పేర్కొన్నారు. మిగిలిన పెన్షన్లను కూడా త్వరితగతిన అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మమ్మీనేని వెంకట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ వీధి శ్రీ భూ సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

### కార్యక్రమంలో పాల్గొన్న పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్ బుద్ధా వెంకన్న



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 1 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ బ్రాహ్మణ వీధిలోని శ్రీ భూ సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జ్ బుద్ధా వెంకన్న పాల్గొని నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బుద్ధా వెంకన్న మాట్లాడుతూ, దేవాలయాల అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణలో దేవస్థాన కమిటీల పాత్ర ఎంతో కీలకమన్నారు. నూతన కమిటీ సభ్యులు సమష్టిగా పనిచేస్తూ దేవస్థానం అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆలయ పవిత్రతను కాపాడేందుకు కృషి చేయాలని సూచించారు. నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన కమిటీ సభ్యులు భక్తుల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా బాధ్యతాయుతంగా పనిచేయాలని బుద్ధా వెంకన్న అన్నారు. దేవస్థానం అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,చైర్మన్ చి పిళ్ల వెంకటేశ్వరరావు గోలి శ్రీనివాసరావు, కోడెబోయిన స్రవంతి,మామిడి సుశీల, ఎన్ రెడ్డి గౌరీ రెడ్డి, లక్కు శాంతి, లింగంపల్లి రామలక్ష్మి, మురళి నాయక్, రెడ్డిపల్లి అనిత పచ్చిపులుసు వెంకట ప్రసాద్, కిలారి శ్రీనివాసరావు భక్తులు, స్థానిక ప్రముఖులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 2, 2026 గాంధీ జయంతి సందర్భంగా కబేళా, చేపల మార్కెట్లు, మాంసపు దుకాణాలకు సెలవు

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 1 :(వార్త ప్రభ ప్రతినిధి)** అక్టోబర్ 2, 2026 గాంధీ జయంతి సందర్భంగా సందర్భంగా విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఉత్తర్వుల మేరకు నేడు 02-10-2026 తేదిన (శుక్రవారం) నగరంలో ఉన్న కబేళాకు సెలవు ప్రకటించారు. నగరంలో ఉన్న అన్ని చికెన్ షాపులు, మటన్ షాపులు, చేపల మార్కెట్లు అన్నియు కూడా తెరుచుటకు అనుమతి లేదు. ఎవరైనా అనుమతి లేకుండా జీవాలను వధించిన యెడల, లేదా షాపులను తెరిచియుండి మటన్, చికెన్ మరియు చేపలను అమ్మిన యెడల చట్ట ప్రకారం వారిపై చర్యలు తీసుకోనబడునని కమిషనర్ ఆదేశించారు. కావున మటన్, చికెన్, చేపలు హోల్ సేల్ మరియు రిటైల్ వ్యాపారస్తులు అన్ని షాపులు మూసి వేయవలెనని ఆదేశించడమైనది.

## శిథిలావస్థకు చేరిన విఎంసి దుకాణాల తొలగింపు



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 1 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు గురువారం ఉదయం సింగ్ నగర్ స్టేడియం షాపింగ్ కాంప్లెక్స్‌లో శిథిలావస్థకు చేరిన ఖాళీ దుకాణాల తొలగింపు (డెమాలిషన్) కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ అధికారులు చేపట్టారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రమాదకరంగా ఉన్న దుకాణాల నిర్మాణాలను తొలగించారు. ఎస్టేట్, టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందిన అధికారులు, ఎన్‌క్రోచ్‌మెంట్ సిబ్బంది సమన్వయంతో ఈ చర్యలు చేపట్టారు. తొలగింపు ప్రక్రియలో తలెత్తే టౌన్ ప్లానింగ్‌కు సంబంధించిన అంశాలను అధికారులు పరిశీలించారు. నగరంలో శిథిలావస్థలో ఉన్న, ప్రజలకు ప్రమాదకరంగా మారే నిర్మాణాలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ధ్యానచంద్ర హెచ్.ఎం. అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ నాగేశ్వరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, ఎస్టేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## వృద్ధులకు,పేదలకు, వితంతువులకు ఎన్టీఆర్ పింఛన్ భరోసా

### జోజినగర్‌లో పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్సీ వర్ల రామయ్య



**విజయవాడ పశ్చిమ అక్టోబరు 1: (వార్త ప్రభ ప్రతినిధి)** పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ ఆర్థికంగా అండగా నిలుస్తోందని ఎమ్మెల్సీ వర్ల రామయ్య అన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం పరిధిలో ఉన్న జోజినగర్‌లో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును అందజేశారు. ఈ సందర్భంగా వర్ల రామయ్య మాట్లాడుతూ.. సమాజంలోని బలహీన వర్గాలకు నెలనెలా ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సామాజిక భద్రతా పింఛన్లను అందిస్తోందన్నారు. వృద్ధాప్యం, వైకల్యం, కుటుంబ పరిస్థితుల కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే వారికి పింఛన్ సొమ్ము నిత్యావసరాలకు తోడ్పాటుగా ఉంటోందన్నారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, పింఛన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి "మానవతా" సహాయం.



**గన్నవరం, అక్టోబర్ 1 :(వార్తా ప్రభ ప్రతినిధి):** మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ గన్నవరం వీరవల్లి గ్రామం నందు అగ్ని ప్రమాదానికి పూర్తిగా నివాసాన్ని కోల్పోయిన కుటుంబానికి 15 వేల రూపాయల విలువ గల ఇంటి సామానులు మరియు దాతలు ఇచ్చినటువంటి సుమారు 20వేల రూపాయలు విలువ గల సామానులు బట్టలు వగైరా మొత్తం 35 వేల రూపాయల విలువ గల వస్తువులను అందజేయడం అయినది. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా మానవతా కోశాధికారి గన్నవరం మానవత చైర్మన్ మదుపల్లి బాలకృష్ణమూర్తి, అధ్యక్షులు కర్రా వరప్రసాద్, కో చైర్మన్ వీసం ప్రసాద్ రావు, గౌరవ డైరెక్టర్ కలపాల శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు ముక్కామల సుబ్బారావు, యర్కా రెడ్డి సంజీవరెడ్డి, సభ్యులు నందిగం రవికుమార్, కలపాల రాజబాబు, వీరవల్లి సొసైటీ ప్రెసిడెంట్ కలపాల నాని బాబు తదితరులు పాల్గొన్నారు దాతలకు బాధితులు ధన్యవాదాలు తెలియజేసినారు.

# స్థానిక సమరంలో కూటమికి అసలు పరీక్ష!

- **ఒక్కటిగా పోరాడితే బలం ఎంత? విడివిడిగా బరిలోకి దిగితే బలమెంత?**
- **2029కు ముందే క్షేత్రస్థాయి రాజకీయ లెక్కలు తేల్చే ఎన్నికలుగా స్థానిక పోరు**




**జగ్గయ్యపేట, అక్టోబర్ 1 (వార్త ప్రభ):**ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై ఉత్కంఠ కొనసాగుతున్న వేళ రాజకీయ పార్టీల మధ్య అసలు పోరు ఎలా ఉండబోతుందన్న దానిపై చర్చలు ఊపందుకుంటున్నాయి. అధికార కూటమిలోని తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీలు కలిసి బరిలోకి దిగుతాయా? లేక స్థానిక స్థాయిలో తమ తమ పార్టీ గుర్తులపై పోటీ చేసి స్వతంత్ర బలాన్ని పరీక్షించుకుంటాయా? అన్నది రాజకీయ వర్గాల్లో కీలక చర్చగా మారింది. ఇప్పటికే ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే నిర్ణయం తీసుకుంది. అయితే ఈ రిజర్వేషన్లపై హైకోర్టులో న్యాయపరమైన సవాళ్లు కొనసాగుతున్నాయి. పూర్తి గణాంకాలు, రిజర్వేషన్లకు ఆధారాలను సమర్పించాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించిన విషయం కూడా స్థానిక ఎన్నికల ప్రక్రియపై ప్రభావం చూపే అంశంగా మారింది.

**2024లో కూటమి... 2026లో క్షేత్రస్థాయి పరీక్ష?** 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోటీ చేశాయి. ఆ ఎన్నికల్లో కూటమి సమన్వయం రాష్ట్ర రాజకీయాల్లో కీలకమైన ఫలితాన్ని ఇచ్చింది. అయితే అసెంబ్లీ లేదా లోక్‌సభ ఎన్నికల్లో పనిచేసే రాజకీయ సమీకరణాలు గ్రామపంచాయతీ, మండల పరిషత్, మున్సిపల్ వార్డు స్థాయిలో అదే విధంగా పనిచేస్తాయని ముందుగానే నిర్ధారించలేం. స్థానిక ఎన్నికల్లో అభ్యర్థి వ్యక్తిగత పరిచయం, కుటుంబ సంబంధాలు, గ్రామంలో అందుబాటులో ఉండటం, స్థానిక సమస్యలపై స్పందన, సామాజిక సమీకరణాలు, గతంలో చేసిన సేవలు వంటి అంశాలు కూడా ఓటర్ల నిర్ణయాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. అందుకే 2024లో కూటమికి వచ్చిన ఓటు నిజంగా మూడు పార్టీల సమిష్టి బలమా? లేక ఒక్కో పార్టీకి ఉన్న స్వతంత్ర ఓటు బలమా? అన్న ప్రశ్నకు స్థానిక ఎన్నికలు కొంత సమాధానం ఇచ్చే అవకాశం ఉంది.

**బీసీ రిజర్వేషన్లు... అభ్యర్థుల లెక్కలపై ప్రభావం**స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం బీసీ రిజర్వేషన్ ఉంటుందని ప్రభుత్వం ప్రకటించినట్లు నివేదికలు వెల్లడించాయి. అయితే ఈ నిర్ణయం కోర్టు పరిశీలనలో ఉండటంతో రిజర్వేషన్ కేటగిరీలపై స్పష్టత వచ్చే వరకు అనేక ప్రాంతాల్లో అభ్యర్థిత్వ లెక్కలు పూర్తిగా ఖరారు కావడం కష్టంగా మారే అవకాశం ఉంది. రిజర్వేషన్లు ఖరారయ్యే విధానం ఆధారంగా గ్రామాల్లో, వార్డుల్లో ఆశావహుల లెక్కలు మారవచ్చు. ఇప్పటికే స్థానికంగా బలమైన నాయకులుగా ఉన్నవారితో పాటు రిజర్వేషన్ కేటగిరీ మార్పు వల్ల కొత్తగా రాజకీయ రంగంలోకి వచ్చే అభ్యర్థులకు కూడా అవకాశం ఏర్పడవచ్చు.

**టీడీపీకి అధికారానంతర స్థానిక పరీక్ష** 2024లో అధికారంలోకి వచ్చిన టీడీపీకి స్థానిక ఎన్నికలు మరో రకమైన రాజకీయ పరీక్షగా మారవచ్చు. రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయంతో పాటు గ్రామస్థాయిలో పార్టీ నాయకత్వం ఎలా పనిచేస్తోంది? స్థానిక సమస్యలను ఎంతవరకు పరిష్కరించింది? సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతవరకు చేరాయి? అధికార యంత్రాంగంతో స్థానిక నాయకుల సమన్వయం ఎలా ఉంది? వంటి అంశాలు కూడా ఎన్నికల సమయంలో చర్చకు వచ్చే అవకాశం ఉంది. అయితే స్థానిక ఎన్నికల ఫలితాలను కేవలం ప్రభుత్వ పనితీరుకు మాత్రమే కొలమానంగా చూడటం కూడా సరైంది కాదు. స్థానిక అభ్యర్థి వ్యక్తిగత బలం, కుటుంబ ప్రభావం, గ్రామంలోని సంబంధాలు వంటి అంశాలు ఫలితాలను ప్రభావితం చేయవచ్చు.

**జనసేనకు కేడర్ విస్తరణకు అవకాశం**2024 ఎన్నికల తర్వాత జనసేనకు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త స్థాయి ప్రాధాన్యత ఏర్పడింది. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన రాజకీయ ప్రాధాన్యతను గ్రామస్థాయిలో సంస్థాగత బలంగా మార్చుకోవడం స్థానిక ఎన్నికల్లో ముఖ్యమైన అంశంగా మారవచ్చు. గ్రామపంచాయతీలు, వార్డులు, మండల స్థాయిలో పార్టీకి ఎంతమంది క్రియాశీల కార్యకర్తలు ఉన్నారు? అభ్యర్థులను నిలబెట్టడానికి తగిన స్థానిక నాయకత్వం ఎంతవరకు సిద్ధంగా ఉంది? ఇతర కూటమి పార్టీలతో స్థానికంగా సమన్వయం ఎలా ఉంది? అన్నది జనసేనకు కీలకంగా మారే అవకాశం ఉంది.

**బీజేపీకి స్వతంత్ర బలాన్ని పరీక్షించుకునే అవకాశం** కూటమిలో భాగస్వామిగా ఉన్న బీజేపీకి కూడా స్థానిక ఎన్నికలు ప్రత్యేకమైన పరీక్షగా మారవచ్చు. 2024లో కూటమి ద్వారా వచ్చిన ఓటు బలంలో బీజేపీకి స్వతంత్రంగా ఎంత మేరకు మద్దతు ఉందన్నది స్థానిక ఎన్నికల ద్వారా అంచనా వేయవచ్చు. అయితే ఒక నియోజకవర్గ స్థాయిలోని ఓటు శాతాన్ని నేరుగా గ్రామపంచాయతీ లేదా వార్డు ఫలితాలతో పోల్చడం కూడా జాగ్రత్తగా చేయాల్సిన అంశమే. స్థానిక నాయకత్వం, బూత్ స్థాయి నిర్మాణం, కార్యకర్తల సంఖ్య, అభ్యర్థుల సామాజిక పరిచయం వంటి అంశాలు ఇక్కడ కీలకం.

**వైఎస్సార్ కాంగ్రెస్‌కు 'ఒంటరి పోరు' మరో పరీక్ష**వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కూడా స్థానిక ఎన్నికలకు అభ్యర్థుల ఎంపికపై దృష్టి పెడుతున్నట్లు తాజా రాజకీయ పరిణామాలు సూచిస్తున్నాయి. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్థానిక ఎన్నికల కోసం బలమైన, విశ్వసనీయ అభ్యర్థులను ఎంపిక చేసి పార్టీని క్రమబద్ధంగా బలోపేతం చేయాలని నాయకులకు సూచించినట్లు నివేదికలు పేర్కొన్నాయి.

కూటమి పార్టీల మధ్య స్థానికంగా పోటీ పెరిగితే వైఎస్సార్ కాంగ్రెస్‌కు ఓట్ల విభజన ద్వారా అవకాశాలు ఏర్పడవచ్చనే రాజకీయ విశ్లేషణ ఉంది. అదే సమయంలో పార్టీ తన స్వంత సంస్థాగత బలం ఎంతవరకు నిలిచివుందో నిరూపించుకోవాల్సిన పరిస్థితి కూడా ఉంటుంది. అందువల్ల స్థానిక ఎన్నికలు కూటమికే కాదు, వైఎస్సార్ కాంగ్రెస్‌కూ క్షేత్రస్థాయి పునర్నిర్మాణ పరీక్షగా మారే అవకాశం ఉంది.

**అసలు పోటీ అభ్యర్థుల మధ్యేనా?**స్థానిక ఎన్నికల్లో పార్టీ గుర్తు కంటే అభ్యర్థి వ్యక్తిగత పరిచయం ముఖ్యమయ్యే సందర్భాలు అనేకం. ఒక గ్రామంలో ఒక పార్టీకి బలమైన నాయకుడు ఉన్నా, అదే పార్టీ తరఫున నిలబడిన అభ్యర్థి స్థానికంగా బలహీనంగా ఉంటే ఫలితం మారవచ్చు. మరోవైపు పెద్ద పార్టీకి చెందిన అభ్యర్థి కంటే స్థానికంగా అందరికీ అందుబాటులో ఉండే స్వతంత్ర వ్యక్తికి కూడా మద్దతు రావచ్చు. కాబట్టి స్థానిక ఎన్నికల ఫలితాలను చూసి వెంటనే "ఈ పార్టీ బలంగా ఉంది, ఆ పార్టీ బలహీనంగా ఉంది" అనే రాష్ట్రస్థాయి నిర్ణయానికి రావడం కంటే ప్రాంతాల వారీగా ఫలితాలను విశ్లేషించడం అవసరం.

**కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటే కీలకం** మూడు పార్టీలు కలిసి పోటీ చేస్తే మరో సమస్య ముందుకు వస్తుంది---ఎవరికి ఏ స్థానాలు? ఒక గ్రామంలో టీడీపీకి బలమైన నాయకుడు ఉన్నప్పుడు జనసేన కూడా అదే స్థానాన్ని కోరితే పరిస్థితి ఎలా పరిష్కరిస్తారు? బీజేపీకి బలమైన స్థానిక కేడర్ ఉన్న ప్రాంతంలో సీటు కేటాయింపు ఎలా ఉంటుంది? ఇప్పటికే స్థానికంగా పనిచేస్తున్న నాయకుడిని పక్కనపెట్టి మరో పార్టీకి అవకాశం ఇస్తే కేడర్ స్పందన ఎలా ఉంటుంది? ఈ ప్రశ్నలకు సమాధానం కనుగొనడం కూటమి నాయకత్వానికి ముఖ్యమైన పని.

**విడిగా పోటీ చేస్తే మరో లెక్క** మూడు పార్టీలు విడివిడిగా పోటీ చేస్తే ప్రతి పార్టీకి స్వతంత్ర బలం కొంత స్పష్టమవుతుంది. కానీ అదే సమయంలో ఓట్ల విభజనకు అవకాశం పెరుగుతుంది. ఒకే రాజకీయ కూటమిలో ఉన్న మూడు పార్టీలు ఒకదానిపై ఒకటి పోటీ చేస్తే ఎన్నికల ప్రచారంలో స్థానిక స్థాయిలో విమర్శలు పెరగవచ్చు. ఎన్నికలు ముగిసిన తర్వాత మళ్లీ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంటే ఆ పోటీ వల్ల ఏర్పడిన విభేదాలను పరిష్కరించడం మరో సవాలుగా మారవచ్చు.

**'కూటమి ఓటు' వర్సెస్ 'పార్టీ ఓటు'**

స్థానిక ఎన్నికలు ఒక ముఖ్యమైన రాజకీయ ప్రశ్నను ముందుకు తెస్తున్నాయి.

2024లో కూటమికి వచ్చిన ఓటు ఎంత? అందులో టీడీపీ స్వతంత్ర బలం ఎంత? జనసేనకు ఉన్న స్వతంత్ర ఓటు ఎంత? బీజేపీకి ఉన్న స్థానిక ఓటు ఆధారం ఎంత? వైఎస్సార్ కాంగ్రెస్ తన సొంత ఓటు బ్యాంకును ఎంతవరకు నిలబెట్టుకుంది? ఈ ప్రశ్నలకు స్థానిక ఎన్నికల ఫలితాలు పూర్తిస్థాయి సమాధానం ఇవ్వకపోయినా, కొన్ని ప్రాంతాల్లో స్పష్టమైన సంకేతాలను మాత్రం ఇవ్వవచ్చు.

**2029కు స్థానిక ఫలితాలు ఎంతవరకు ఉపయోగపడతాయి?**స్థానిక ఎన్నికల ఫలితాలను 2029 సార్వత్రిక ఎన్నికల వ్యూహాలకు రాజకీయ పార్టీలు ఉపయోగించుకునే అవకాశం ఉంది. ఏ ప్రాంతంలో ఏ పార్టీకి బలమైన కేడర్ ఉంది? ఎక్కడ ఏ సామాజిక సమీకరణ పనిచేస్తోంది? ఎక్కడ అభ్యర్థి వ్యక్తిగత ప్రభావం ఎక్కువ? వంటి అంశాలపై పార్టీలు అంతర్గతంగా విశ్లేషణ చేసుకోవచ్చు.

అయితే స్థానిక ఎన్నికల ఫలితాలను 2029 అసెంబ్లీ ఎన్నికలకు నేరుగా అద్దంగా చూడటం మాత్రం జాగ్రత్తగా చేయాల్సిన పని. రెండు ఎన్నికల స్వభావం, అభ్యర్థుల ప్రాధాన్యత, స్థానిక సమస్యలు, రాజకీయ అంశాలు వేర్వేరుగా ఉండవచ్చు.

**జగ్గయ్యపేటలో మరింత ఆసక్తికరంగా మారనున్న సమీకరణాలు**

జగ్గయ్యపేట వంటి నియోజకవర్గంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల రాజకీయ సమీకరణాలు స్థానిక ఎన్నికల్లో ప్రత్యేకంగా కనిపించే అవకాశం ఉంది. మున్సిపల్ వార్డులు, గ్రామపంచాయతీలు, మండల స్థాయిలో ఎవరి కేడర్ ఎంత చురుకుగా ఉంది? ఎవరు ప్రజలకు అందుబాటులో ఉన్నారు? స్థానిక సమస్యలపై ఎవరు ముందుండి పోరాడారు? రిజర్వేషన్ మార్పులు ఎవరికి రాజకీయ అవకాశం కల్పిస్తున్నాయి? కూటమి పార్టీల మధ్య స్థానికంగా సమన్వయం ఎంతవరకు ఉంది? అన్నదే అసలు పరీక్ష. ఇక్కడ ఒక్కో గ్రామం, ఒక్కో వార్డు ఫలితం కూడా నియోజకవర్గ రాజకీయాల్లో భిన్నమైన సందేశాన్ని ఇవ్వగలదు.

**తుది లెక్క ఎవరిది?**ప్రస్తుతం స్థానిక ఎన్నికల తేదీల కంటే ముందే రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపిక, రిజర్వేషన్లు, స్థానిక సమీకరణాలు, కూటమి సర్దుబాట్లు వంటి అంశాలపై దృష్టి పెట్టాల్సిన పరిస్థితి ఉంది. రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ఎన్నికల ఏర్పాట్లు కొనసాగుతున్నాయని పేర్కొంటూ, నకిలీ ఎన్నికల షెడ్యూల్ ప్రచారాలపై ఫిర్యాదు చేసినట్లు తాజా సమాచారం వెల్లడించింది. అందువల్ల అధికారిక షెడ్యూల్, రిజర్వేషన్ తుది ప్రక్రియ, కూటమి పార్టీల సీట్ల సర్దుబాటు వంటి అంశాలు స్పష్టమైన తర్వాతే స్థానిక రాజకీయ లెక్కలు మరింత స్పష్టంగా బయటపడే అవకాశం ఉంది.

కూటమిగా పోటీ చేస్తే సమిష్టి బలం పరీక్షకు వస్తుంది.

విడివిడిగా పోటీ చేస్తే ఒక్కో పార్టీ స్వతంత్ర బలం పరీక్షకు వస్తుంది.

కానీ ఏ పరిస్థితిలోనైనా స్థానికంగా అభ్యర్థి బలం, ప్రజల సమస్యలు, సామాజిక సమీకరణాలు, కేడర్ పనితీరు కీలకంగా ఉంటాయి.

చివరికి ఎన్నికల ఫలితాన్ని నిర్ణయించేది పార్టీ లెక్కలు కాదు–ఓటర్ల తీర్పు.

**తీర్పు ప్రజలదే...లెక్కలు రాజకీయ పార్టీలవే!**

## జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రేసులో కళ్యాణపు సూర్యప్రకాశరావు

### 16 ఏళ్లుగా టీడీపీలో క్రియాశీల కార్యకర్తగా సేవలు.. చైర్మన్ అభ్యర్థిత్వంపై ఆసక్తి



**జగ్గయ్యపేట, అక్టోబర్ 1 (వార్తప్రభ):**స్థానిక సంస్థల ఎన్నికలకు మార్గం సుగమం అవుతున్న నేపథ్యంలో జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిత్వంపై ఆశావహుల్లో చర్చ మొదలైంది. ఈ క్రమంలో తెలుగుదేశం పార్టీకి చెందిన కళ్యాణపు సూర్యప్రకాశరావు చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేయాలనే ఆసక్తితో ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గత 16 ఏళ్లుగా టీడీపీలో క్రియాశీలక కార్యకర్తగా కొనసాగుతున్న సూర్యప్రకాశరావు పలు ఎన్నికల్లో వార్డు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏజెంట్‌గా పనిచేసిన అనుభవం ఉందని ఆయన అనుచరులు చెబుతున్నారు. 2021 మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప మెజారిటీతో ఓటమి పాలయ్యారు. మృదు స్వభావం, స్నేహశీలి వ్యక్తిగా స్థానికంగా పరిచయం ఉన్న సూర్యప్రకాశరావు.. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, కష్టకాలంలో కార్యకర్తలకు అండగా నిలిచే వ్యక్తిగా తనకంటూ గుర్తింపు పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి హైకోర్టు తీర్పుతో కీలక అడ్డంకులు తొలగిన నేపథ్యంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో కూటమి తరఫున జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిత్వం దక్కుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. పార్టీ నిర్ణయం ఎలా ఉంటుందో వేచి చూడాల్సి ఉండగా, టికెట్ దక్కని పక్షంలో ఆయన స్వతంత్రంగా లేదా రెబల్ అభ్యర్థిగా బరిలోకి దిగే అవకాశాలపై కూడా స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే అభ్యర్థుల తుది ఎంపిక, వార్డు రిజర్వేషన్లు, కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు వంటి అంశాలు స్పష్టమైన తర్వాతే సూర్యప్రకాశరావు రాజకీయ అడుగుపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## డ్రగ్స్ రహిత సమాజం - మహిళల భద్రత -రోడ్డు భద్రత 'త్రిశూల్' లక్ష్యంగా త్రిశూల్ కార్యక్రమం





**రెడ్డిగూడెం అక్టోబర్,1(వార్తాప్రభ ప్రతినిధి ):**డ్రగ్స్ రహిత సమాజ స్థాపన, మహిళల భద్రత, రోడ్డు భద్రత అనే మూడు ప్రధాన లక్ష్యాలతో పోలీస్ వారు నిర్వహించిన 'త్రిశూల్' కార్యక్రమం రెడ్డిగూడెంలో జరిగింది .ఈ కార్యక్రమంలో భాగంగా రెడ్డిగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని విద్యాసంస్థల వద్ద ప్రతిరోజూ ఉదయం 9:00 నుంచి 10:00 గంటల వరకు, సాయంత్రం 4:00 నుంచి 5:00 గంటల వరకు 'త్రిశూల్' పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళా పోలీస్ సిబ్బంది విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంటు విద్యాసంస్థల పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరిగే యువకులు, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసారు. అలాగే విద్యార్థుల్లో డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పించి మహిళల భద్రతపై చైతన్యం తీసుకురావడం, రోడ్డు భద్రతా నిబంధనలు పాటించేలా అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను నిర్వహించారు .విద్యార్థినులు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా తమ సమస్యలను మహిళా పోలీస్ సిబ్బందికి తెలియజేయాలని, వేధింపులు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని రెడ్డిగూడెం పోలీసులు సూచించారు.

## ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం షెడ్యూల్‌లో మార్పు



**విజయవాడ: అక్టోబర్ 1 :(వార్తా ప్రభ ప్రతినిధి)**భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చేపడుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమానికి సంబంధించి సవరించిన షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ప్రకటించిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి. లక్ష్మీశ తెలిపారు. ఎన్నికల సంఘం ఉత్తర్వుల ప్రకారం సవరించిన షెడ్యూల్‌లో భాగంగా క్లెయిమ్‌లు, అభ్యంతరాల నోటీసుల దశ, వాటి పరిష్కార ప్రక్రియ జూలై 31,2026 నుంచి అక్టోబర్ 10,2026 వరకు కొనసాగుతుందని తెలిపారు. అనంతరం తుది ఓటర్ల జాబితా అక్టోబర్ 16, 2026న ప్రచురించబడుతుందని పేర్కొన్నారు. సవరించిన షెడ్యూల్‌కు సంబంధించి జిల్లా స్థాయిలో సంబంధిత అధికారులు, సిబ్బందికి సమాచారం అందించి, ప్రజలకు విస్తృతంగా ప్రచారం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు కూడా సవరించిన షెడ్యూల్‌ను లిఖితపూర్వకంగా తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో తమ పేరు, వివరాలను పరిశీలించుకోవాలని, ఏవైనా అభ్యంతరాలు లేదా సవరణలు అవసరమైతే నిర్ణీత గడువులోగా సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ డ జిల్లా ఎన్నికల అధికారి డా.జి. లక్ష్మీశ ప్రజలకు సూచించారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన విక్కుర్తి శ్రీనివాసరావు.



**అవనిగడ్డ: అక్టోబర్ 1 (వార్తాప్రభ ప్రతినిధి)** పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా రేపల్లె నియోజకవర్గ పర్యటనకు గురువారం విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ విక్కుర్తి శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. విక్కుర్తి శ్రీనివాసరావుతో పాటు ఆయన సోదరుడి కుమారుడు విక్కుర్తి రాఘవ నాయుడు ఉన్నారు.

## తోట చర్ల లో విజయవంతంగా ఆర్.డి.ఎస్.ఎస్. పథకం అమలు



**పెనుగంచిప్రోలు- అక్టోబర్ 1( వార్త ప్రభ )**పునరుద్ధరించిన పంపిణీ,రంగ పథకం ( ఆర్ డి ఎస్ ఎస్) ను పెనుగంచిప్రోలు మండలంలోని తోటచర్ల గ్రామం లో విజయవంతంగా పూర్తి చేశారు. ఏ ఈ, వెంకటకృష్ణ, లైన్ మెన్ వేల్పుల ప్రసన్న, ప్రాజెక్ట్ ఇంజనీర్ రాజేష్ ల ఆధ్వర్యంలో పాతవాటి స్థానాల్లో కొత్త లైన్స్ ,కొత్త విద్యుత్ స్తంభాలు, కొత్త ట్రాన్స్ఫర్లను నెలకొల్పి విద్యుత్తును పునరుద్దించారు. ఈ సందర్భంగా రాజేష్ ప్రసన్నలు మాట్లాడుతూ ,ఈ పథకం ద్వారా విద్యుత్తు సరఫరా వ్యవస్థను ఆధునీకరించడానికి డిస్కమ్స్ ల ఆర్థిక నష్టాలను తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఒక ప్రతిష్టాత్మక సంస్కరణల ఆధారిత పథకం అన్నారు. దేశవ్యాప్తంగా మొత్తం సాంకేతిక మరియు వాణిజ్య నష్టాలను12--15 శాతానికి తగ్గించడం మరియు సరఫరా ఖర్చు-- రాబడి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని సున్నా కి తీసుకురావడం ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు .గతంలో 24 గంటలు కరెంటు ఉండేది కాదని, ఈ పథకం ద్వారా ప్రస్తుతం మూడు ఫేసులు ఉంటుందని తద్వారా కరెంటు 24 గంటలు ఉంటుందన్నారు .వ్యవసాయ భూములకు నిరంతరం కరెంటు అందుబాటులోఉంటుందన్నారు. ఈ పథకం అమలు కావడం వల్ల వినియోగదారులందరికి కరెంటు ఎలాంటి అంతరాయం లేని విధంగా అధిక నాణ్యత కలిగిన విద్యుత్తును అందించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఈ,వెంకటకృష్ణ, లైన్ మెన్ వేల్పుల ప్రసన్న ,ఇంజనీర్ రాజేష్ మరియు విద్యుత్ వర్కర్లు పాల్గొన్నారు...

## మోడీ సారధ్యంలో అగ్రగామిగా భారతదేశం

### గడప గడపకు బిజేపీ కరపత్రాల పంపిణీ



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 01(వార్తా ప్రభ ప్రతినిధి)** :మోడీ సాధ్యంలో ప్రపంచం లోనే అగ్రగామిగా భారతదేశ దూసుకెళ్తుందని తెలిపారు కొండపల్లి పట్టణ బీజేపీ అధ్యక్షురాలు తమ్మినేని మాధురీ సుదీష్ణ. గురువారం కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 194 వ బూత్ లో ప్రతి గడప గడపకు బిజెపి 2 విడత నిర్వహించారు. ప్రతి ఇంటికి తిరిగి కరపత్రాల ద్వారా గత 12 సంవత్సరాలలో దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం చేసిన బహుముఖ అభివృద్ధి పనులను ,మరియు అంతర్జాతీయంగా భారతదేశ పేరు ప్రతిష్ఠలు పెంపొందించే కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి దాము భవానీ, సేనాపతి నాగమణి,సారథి, రమేష్,శివాజీ, నరసింహా రావు పాల్గొన్నారు.

## పశ్చిమ లో రూ 4.82 కోట్లతో రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సుజనా చౌదరి





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 1 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ, పశ్చిమ నియోజకవర్గంలో రూ 4.82 కోట్లతో చేపట్టిన ఎండ్ టు ఎండ్ రోడ్ల నిర్మాణ పనులకు విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి శంకుస్థాపన చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులతోప్రకాశం పంతులు గారి విగ్రహం నుండి ప్రకాశం బ్యారేజ్ వరకు రోడ్డుకి ఇరువైపులా డస్ట్ ఫ్రీ బీటీ రోడ్డు (రూ 199. 88 కోట్లు) 41 వ డివిజన్ వాసవి కళ్యాణ మండపం రోడ్డులో (రూ 48.87 లక్షలు) 45 వ డివిజన్ మాదాసు రామారావు వీధిలో( రూ 71.26 లక్షలు) అదేవిధంగా 49 వ డివిజన్ ఎర్రకట్ట నుండి సొరంగం వరకు రూ 1.62 లక్షలతో నూతనంగా నిర్మించనున్న ఎండ్ టు ఎండ్ బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే సుజనా చౌదరి ,టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు పశ్చిమ టీడీపీ ఇన్చార్జ్ బుద్దా వెంకన్న మరియు మాజీ కార్పొరేటర్లు కూటమి నేతలతో కలిసి ఎమ్మెల్యే సుజనా చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. విద్య , వైద్య రంగాల బలోపేతానికి అధిక ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు ప్రజలందరికీ పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయం అనునిత్యం అందుబాటులో ఉంటుందని ఎవరికి ఎటువంటి సమస్య ఉన్న ఎమ్మెల్యే కార్యాలయంలో తెలియజేయాలని ఎమ్మెల్యే సుజనా చౌదరి తెలిపారు. ఈ ఈ శ్రీనివాస్, డీ ఈ పురుషోత్తం,ఏఈలు రాజేష్, మార్క్, జాస్మిన్ , జనార్ధన్ మాజీ కార్పొరేటర్లు యేదుపాటి రామయ్య,బుల్లా విజయ్ కుమార్, పత్తి నాగేశ్వరరావు,మహాదేవు అప్పాజీరావు, మరుపిళ్ల రాజేష్, గుడివాడ నరేంద్ర రాఘవ,మహ్మద్ అబ్దుల్ ఖాదర్,అత్తలూరి ఆదిలక్ష్మీ పెదబాబు, టీడీపీ సీనియర్ నాయకులు మైలవరపు కృష్ణ, జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్రా జోన్ కన్వీనర్ బాడిత శంకర్, కూటమి నేతలు రెడ్డిపల్లి రాజు, బొమ్ము రాంబాబు, బొమ్ము గోవిందమ్మ, దుర్వేసుల హుస్సేన్,పచ్చవ మల్లికార్జునరావు, మైనంపాటి రమేష్, బ్రహ్మారెడ్డి, చిన బాబు, కొమర కిరణ్, రాజేశ్వరి, పల్లెపోగు ప్రసాద్, దేవిన హరి ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు..

# పేదలకు పెన్షన్.. ఆర్థిక భరోసా

**- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ భరోసా: టీడీపీ టౌన్ అధ్యక్షుడు సకూరి ధనుంజయ రెడ్డి**



**చంద్రగిరి, అక్టోబర్ 1 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్ ఆర్థిక భరోసాగా నిలుస్తోందని టీడీపీ టౌన్ పార్టీ అధ్యక్షుడు సకూరి ధనుంజయ రెడ్డి అన్నారు. గురువారం చంద్రగిరి పట్టణంలోని భారతి నగర్, కోట ప్రాంతాల్లో ఉదయం ఏడు గంటలకే ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను అందజేశారు. ఈ సందర్భంగా సకూరి ధనుంజయ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెంచిన పెన్షన్‌ను ప్రతి నెలా మొదటి తేదీనే లబ్ధిదారులకు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ అర్హులైన పేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. యూనిట్ ఇన్‌చార్జ్ లోకేష్ రాయల్ మాట్లాడుతూ చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవతో లబ్ధిదారులకు తొలిరోజే పెన్షన్ అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం అర్హత కలిగిన లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందిస్తున్నట్లు చెప్పారు. పెన్షన్ పంపిణీ అనంతరం నాయకులు లబ్ధిదారులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రవితేజ యాదవ్, వాసు, లీలా కృష్ణ, పార్టీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పేదవారి కడుపు నింపటమే నిజమైన పండగ

**సూఫీ మత గురువులు అల్తాఫ్ బాబా**



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 01(వార్తా ప్రభ ప్రతినిధి):** పేదవారి కడుపు నింపటమే నిజమైన పండగ అని అన్నారు సూఫీ మాత గురువులు అల్తాఫ్ బాబా. గార్వి పండుగ సందర్భంగా పశ్చిమ ఇబ్రహీంపట్నం మస్జిద్ వద్ద గురువారం రాత్రి భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సూఫీ మత గురువులు హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మస్జిద్ కమిటీ సభ్యులతో కలిసి అన్న సమారాధన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ పండుగ అయినా సరే ముందు పేదవారికి అన్నం పెట్టాలని అన్నారు. ఇస్లాంలో జరుపుకునే ప్రతి యొక్క పండగ ముఖ్య ఉద్దేశం కూడా పేదవారికి కడుపు నింపటమే అని తెలిపారు. ముందుగా గౌసే పాక్ జండా వద్ద ఫాతేహ ఖానీ నిర్వహించారు. అందరికీ మంచి జరగాలని ప్రత్యేక ప్రార్ధనలు జరిపారు. ఈ సందర్భంగా మజీద్ కమిటీ సభ్యులు అల్తాఫ్ బాబా ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మస్జిద్ కమిటీ ప్రెసిడెంట్ షేక్ ముస్తఫా, కోశాధికారి కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

# విజయనగర్ అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా అంగన్వాడి ఉత్సవం

**- తల్లులు, పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు సంక్షేమ పథకాలపై అవగాహన**





**చంద్రగిరి, అక్టోబర్ 1 :(వార్తా ప్రభ ప్రతినిధి):** సేవా సంకల్పం కార్యక్రమంలో భాగంగా విజయనగర్ అంగన్వాడీ కేంద్రంలో గురువారం "అంగన్వాడీ ఉత్సవం" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి, తల్లులు, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, ఆరోగ్య సేవలు, పోషకాహార కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సిబ్బంది మాట్లాడుతూ చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యం, ఎదుగుదల, విద్యాభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు కీలకంగా పనిచేస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా 1000 గోల్డెన్ డేస్, ఐవీఆర్ఎస్ కాల్స్, ఆర్ఎల్ఎం సందేశాలు, ప్రధానమంత్రి మాతృ వందన యోజన (పీఎంఎంవై), ఏఐ--ఈసీడీ స్క్రీనింగ్, పోషణ మాసోత్సవాలు, వైవిధ్యభరితమైన పౌష్టికాహారం, ఈసీఈఈ కార్యక్రమాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, తల్లులు, పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, ఆరోగ్య పరిరక్షణ, ప్రీ-స్కూల్ విద్య, ఎదుగుదల పర్యవేక్షణ తదితర సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నారులకు పోషకాహారం అందించడం, పరిశుభ్రత పాటించడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచవచ్చని తెలిపారు. అంగన్వాడీ సేవలపై తల్లిదండ్రులు అవగాహన పెంచుకుని, పిల్లల ఆరోగ్యం, విద్యాభివృద్ధిలో భాగస్వాములు కావాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి సీడీపీఓ ప్రదీప, సూపర్వైజర్లు ధన, తులసి, కిరణ్మయి, మనీల, అంగన్వాడీ కార్యకర్త, ఆశా కార్యకర్తలు, తల్లులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై వైసీపీ నేతల వైఖరి దుర్మార్గం

**- 34 శాతం రిజర్వేషన్లను అడ్డుకునే ప్రయత్నాలు బీసీలకు అన్యాయం: సత్తు మధుసూదన్ యాదవ్**



**తిరుపతి, అక్టోబర్ 1 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అంశంపై రాజకీయ వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కోర్టులను ఆశ్రయించి బీసీ రిజర్వేషన్లను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని టీడీపీ బీసీ సాధికారిక సమితి రాష్ట్ర నాయకులు సత్తు మధుసూదన్ యాదవ్ ఆరోపించారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల సమయంలో టీడీపీ, కూటమి నాయకులు హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. అధికారంలోకి వచ్చిన అనంతరం బీసీలకు 34 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించే దిశగా అసెంబ్లీలో నిర్ణయం తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే సమయంలో కొందరు రాజకీయ నాయకులు కోర్టులను ఆశ్రయించడం వల్ల బీసీ రిజర్వేషన్లపై అనిశ్చితి ఏర్పడిందని పేర్కొన్నారు. బీసీలకు రిజర్వేషన్లు పెంచే చర్యలను స్వాగతించాల్సిన సమయంలో వాటిని న్యాయస్థానాల్లో సవాలు చేయడం సమంజసం కాదని మధుసూదన్ యాదవ్ అన్నారు. బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని కాపాడేందుకు టీడీపీ అవసరమైన న్యాయపరమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అయితే, అక్టోబర్ 1న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 34 శాతం బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను కొట్టివేసినట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను ఆరు వారాల్లో ప్రారంభించాలని కోర్టు ఆదేశించినట్లు సమాచారం. బీసీల హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యంపై టీడీపీ నిరంతరం పోరాడుతుందని సత్తు మధుసూదన్ యాదవ్ తెలిపారు.

# స్థానిక పాత్రికేయులపై... బురద జల్లడం తగదు

- ప్రభుత్వ భూముల కబ్జాలతో ముడి పెడుతూ కించపరిచే కథనాలపై ఆగ్రహం. ● పాత్రికేయ వృత్తిని... మంట గలపకండి.
- జవహర్ నగర్ పోలీసులకు స్థానిక పాత్రికేయుల ఫిర్యాదు.
- విచారణలో తప్పు తేలితే చర్యలు తప్పవు: ఎస్హెచ్ఓ సైదులు.






**జవహర్ నగర్ అక్టోబర్ 1 (వార్తా ప్రభ):** స్థానిక పాత్రికేయులపై బురద జల్లడం తగదని ప్రభుత్వ భూముల కబ్జాలతో వారిని ముడి పెడుతూ కించపరిచే కథనాలు ప్రచురించడం తగదని స్థానిక పాత్రికేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లో ప్రభుత్వ భూముల కబ్జాల వ్యవహారంలో జవహర్ నగర్ స్థానిక విలేకరుల హస్తం ఉందంటూ ఆధారాలు చూపకుండా ఆరోపణలు చేయడం స్థానిక పాత్రికేయులను కించపరిచే కథనాలు ప్రచురించడం తగదని స్థానిక విలేకరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై నిష్పక్షపాత విచారణ జరిపి వాస్తవాలను?? వెలుగులోకి తేవడంతో పాటు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ జవహర్ నగర్ పోలీస్ స్టేషన్లో స్థానిక పాత్రికేయులందరూ గురువారం జవహర్ నగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ గత మూడు రోజులుగా జవహర్ నగర్ లో ప్రభుత్వ భూముల కబ్జాల వెనుక స్థానిక పాత్రికేయుల హస్తం ఉందనే ఆరోపణలతో ప్రచారం జరుగుతోందని పేర్కొన్నారు. దీనికి తోడు జవహర్ నగర్ లో సుమారు 200 మంది విలేకరులు ఉన్నారని వారిలో కొందరికి పెన్ను పేపర్ ఇస్తే సొంత పేరు కూడా రాయడం రాదని రీతిలో అవమానకర వ్యాఖ్యలు ప్రచురించడం స్థానిక విలేకరుల వృత్తిపరమైన గౌరవాన్ని దెబ్బతీసేలా ఉందని తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కొన్ని పత్రికల్లో ఇటువంటి వ్యాఖ్యలతో కూడిన కథనాల ప్రతులను పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుల పేర్కొన్నారు ఇలాంటి నిర్దిష్ట ఆధారం లేకుండా పాత్రికేయులందరినీ ఒకే ఘూటాన కట్టి కించపరిచేలా విష ప్రచారం చేయడం తగదన్నారు.

.

**ఆధారాలుంటే బయటపెట్టాలి.** ప్రభుత్వ భూముల కబ్జాలో నిజంగా ఎవరైనా విలేకరుల ప్రమేయం ఉంటే వారి పేర్లతో పాటు సంబంధిత ఆధారాలను పోలీసులకు రెవెన్యూ అధికారులకు అందించాలని స్థానిక విలేకరులు స్పష్టం చేశారు. అక్రమాలకు పాల్పడిన వారిని రక్షించాల్సిన అవసరం తమకు లేదని తప్పు చేసిన వారు ఎవరైనా చట్ట ప్రకారం చర్యలు ఎదుర్కోవాల్సిందేనని అన్నారు. అయితే కొందరిపై ఆరోపణలు ఉన్నాయని కారణంతో జవహర్ నగర్ లో విధులు నిర్వహిస్తున్న పాత్రికేయులందరినీ కబ్జాలతో ముడిపెట్టి వారి వృత్తిని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. ఇటువంటి ప్రచారం నిజాయితీగా విధులు నిర్వహిస్తున్న పాత్రికేయుల గౌరవ ప్రతిష్ట లకు భంగం కలిగించడంతోపాటు ప్రజల్లో అపోహలకు కారణం అవుతుంది అని తెలిపారు.

**తప్పుడు కథనాలపై తప్పు తేలితే చర్యలు: ఇన్స్పెక్టర్ సైదులు.** పాత్రికేయుల ఫిర్యాదు పై జవహర్ నగర్ ఎస్హెచ్ఓ సైదులు స్పందించారు ప్రభుత్వ భూముల కబ్జాలకు సంబంధించి ఎవరైనా నిర్దిష్ట ఆధారాలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అందిన ఆధారాలను పరిశీలించి వాస్తవాల ఆధారంగా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆధారాలు లేకుండా వ్యక్తులను లేదా పాత్రికేయలను లక్ష్యంగా చేసుకొని వారి గౌరవ ప్రతిష్టలకు భంగం కలిగించే విధంగా ఆరోపణలు, ప్రచారాలు మానాలని హెచ్చరించారు. పాత్రికేయులు ఇచ్చిన ఫిర్యాదు పై నిష్పక్షిపాతంగా విచారణ చేపడతామని విచారణలో ఎవరైనా చట్ట ఉల్లంఘనలకు పాల్పడినట్లు తేలితే వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని ఇన్స్పెక్టర్ సైదులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక విలేకరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై వైసీపీ కుట్రలు: నరసింహ యాదవ్

**- 34 శాతం రిజర్వేషన్ల కోసం సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం**







**తిరుపతి,అక్టోబర్ 1 :(వార్తా ప్రభ ప్రతినిధి):** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోలను ఏపీ హైకోర్టు కొట్టివేయడంపై టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ స్పందించారు. తిరుపతిలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై న్యాయపరమైన పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. బీసీలకు గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జీవో నంబర్ 105, 1065లను జారీ చేసింది. అయితే ఈ జీవోలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు వాటిని కొట్టివేసింది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని దాటుతున్నాయన్న అంశం సహా పలు న్యాయపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం వెలువడింది. అదే సమయంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను ఆరు వారాల్లో ప్రారంభించాలని హైకోర్టు ఆదేశించింది. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచాలనే ఉద్దేశంతోనే 34 శాతం రిజర్వేషన్లను ప్రభుత్వం తీసుకొచ్చిందని నరసింహ యాదవ్ పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయానికి సంబంధించిన న్యాయపరమైన అంశాలపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు టీడీపీ కట్టుబడి ఉందన్నారు. బీసీల రిజర్వేషన్ల అంశంపై గతంలో కూడా న్యాయపరమైన వివాదాలు తలెత్తాయని, వాటి కారణంగా బీసీలకు రాజకీయ అవకాశాలు తగ్గాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా చర్యలు తీసుకుందని తెలిపారు. ప్రభుత్వం హైకోర్టుకు సమర్పించిన వివరాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేలో బీసీల జనాభా సుమారు 50.42 శాతంగా నమోదైనట్లు వెల్లడించింది. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచేందుకు టీడీపీ ఆవిర్భావం నుంచి పలు చర్యలు చేపట్టిందని నరసింహ యాదవ్ అన్నారు. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో బీసీల రిజర్వేషన్ల అంశంపై పార్టీ తరఫున న్యాయపోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ఆరు వారాల్లో ప్రారంభించాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను స్వాగతిస్తున్నామని తెలిపారు.

# క్యాంపస్ డ్రైవ్ లో 12 మంది ఆర్కే కళాశాల విద్యార్థుల ఎంపిక





**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 01(వార్తా ప్రభ ప్రతినిధి):** స్థానిక ఆర్కే ఇంజనీరింగ్ కళాశాల లో 10,000 కోడర్స్ కంపెనీ హైదరాబాద్ వారు గురువారం క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. అందులో ఆర్కే కళాశాలకు చెందిన 12 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె రామకృష్ణయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విద్యార్థులను కళాశాల చైర్మన్ ఎం ఎం కొండయ్య, ట్రెజరర్ ఎం గౌరీ అమర్నాథ్, సెక్రటరీ డా ఎం మహేంద్రనాథ్, ప్రిన్సిపల్ మరియు సిబ్బంది ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు పరిశ్రమకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రముఖ సంస్థలతో కలిసి మరిన్ని క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లు నిర్వహిస్తామని తెలిపారు.

# వి బి జి రామ్ జి ఫీల్డ్ అసిస్టెంట్ ల డిమాండ్లను నెరవేర్చాలి.....

**కాగిత కు వినతి పత్రం అందించిన జాయింట్ యాక్షన్ కమిటీ**



**పెడన వార్తా ప్రభ ప్రతినిధి అక్టోబర్ 1 :** తాము దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ ఫీల్డ్ అసిస్టెంట్ల యాక్షన్ కమిటీ శుక్రవారం నాడు స్థానిక శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ ను తోట మూల లోని శాసనసభ్యుని కార్యాలయంలో కలసి వినతిపత్రం అందజేశారు. తమ వేతనాలను 26వేలుకు పెంచడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరారు. అర్హత ఉన్నవారికి పదోన్నతులుతో పాటు బదిలీలు కూడా కల్పించాలని కోరారు. వీరు గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గత 19 సంవత్సరాలు నుంచి విధులు నిర్వహిస్తున్నారు. వీరికి కేవలం 5745 రూపాయలు మాత్రమే వేతనం చెల్లిస్తున్నారు. ఈనెల 5వ తేదీ లోపు తమ డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వానికి వారు అల్టిమేటం ఇచ్చారు. అప్పటికి సమస్యలు పరిష్కారం కాకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని వారు పేర్కొన్నారు.

# కొనసాగుతున్న అనధికార నిర్మాణాలపై ఎన్ఫోర్స్‌మెంట్ చర్యలు







**శేరిలింగంపల్లి,అక్టోబర్ 1 (వార్తాప్రభ):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలో అనధికార నిర్మాణాలపై ఎన్ఫోర్స్‌మెంట్ చర్యలు కొనసాగుతున్నాయి. మూడు జోన్లలో చేపట్టిన తనిఖీల్లో 10 అనధికార నిర్మాణాలను గుర్తించి కూల్చివేశారు. మరో నాలుగు నిర్మాణాలకు నోటీసులు జారీ చేశారు. అనధికార నిర్మాణాలపై నిరంతరం క్షేత్రస్థాయి పర్యవేక్షణ చేపట్టి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సీఎంసీ కమిషనర్ అధికారులను ఆదేశించారు. తనిఖీలు, ఎన్ఫోర్స్‌మెంట్ చర్యలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

# సందర్శకులను ఆకట్టుకున్న "గుజరాత్ హ్యాండీక్రాఫ్ట్స్ ఉత్సవ్-2026"





**మాదాపూర్,అక్టోబర్ 1 (వార్తాప్రభ):** మాదాపూర్ శిల్పారామంలో ఇండెక్స్-సి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గుజరాత్ హ్యాండీక్రాఫ్ట్స్ ఉత్సవ్--2026 సందర్శకులను ఆకట్టుకుంటోంది. ఇందులో భాగంగా గురువారం డాక్టర్ కల్పన నారెడ్ల శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించింది. వినాయక కౌతం, మూషికవాహన, శ్రీ విఘ్నరాజం భజే, మహాగణపతిమ్, భాగ్యదా లక్ష్మి, స్వాగతం కృష్ణ, శృంగార లహరి, అన్నమాచార్య కీర్తన, లింగాష్టకం, ఆధారం మధురం, గరుడ గమన తదితర అంశాలను కళాకారులు శ్రావ్యరెడ్డి, తన్వి, గిరీశం, లేఖ్య, వైష్ణవి, ఝాన్సీ, జ్యోతిర్మయి, హాన్విత, పర్ణిక, కీర్తిక, జాగృతి, వేదశి, కిరణ్మయి ప్రదర్శించి అలరించారు.

# రుయాలో మెగా మెడికల్ క్యాంప్ ప్రారంభం





**తిరుపతి, అక్టోబర్ 1 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సేవా సంకల్ప్ అభియాన్--2026లో భాగంగా తిరుపతిలోని రుయా ఆసుపత్రిలో గురువారం మెగా మెడికల్ క్యాంప్‌ను తిరుపతి శాసనసభ్యులు ఆరని శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "సేవ నేడు.. ఆరోగ్యం రేపు" అనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా సమాజంలోని ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఆరోగ్యకరమైన, బలమైన, స్వావలంబన కలిగిన భారతదేశ నిర్మాణానికి సమాజాలను సాధికారత చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా వైద్య సేవలు అందుబాటులో లేని ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను చేరువ చేయడం, నివారణాత్మక ఆరోగ్య సంరక్షణను ప్రోత్సహించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన కల్పించడం ఈ మెగా క్యాంప్ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. వైద్య కళాశాల అదనపు వైద్య విద్యా సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రవి ప్రభు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన, ఉత్పాదక సమాజ నిర్మాణానికి ఇటువంటి వైద్య శిబిరాలు దోహదపడతాయని తెలిపారు. శిబిరంలో ఉచిత ఆరోగ్య పరీక్షలు, రక్తపోటు, మధుమేహ పరీక్షలు, నిపుణుల వైద్యుల సంప్రదింపులు, టీకా కార్యక్రమాలు, వ్యాధుల నివారణపై అవగాహన, తల్లి--శిశు ఆరోగ్య సేవలు, పోషకాహారం, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి. మనోహర్ మాట్లాడుతూ మానసిక ఆరోగ్య ప్రోత్సాహం, అవసరమైన మందుల సహాయం, రిఫరల్ సేవలు, ఫాలోఅప్ వైద్య సంప్రదింపులు, సమాజం, యువత, వాలంటీర్లు, కమ్యూనిటీ నాయకుల భాగస్వామ్యం కూడా ఈ కార్యక్రమంలో భాగమని వివరించారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ జి. నరసింహ యాదవ్, రుయా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్యులు, వైద్య విద్యార్థులు, నర్సింగ్, అలైడ్ హెల్త్ సైన్సెస్ విద్యార్థులు, ఎస్వీ వైద్య కళాశాల పీఆర్వో వీర కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# చేనేత వైభవానికి 'చేనేత బజారు' చేయూత

● క్రాఫ్ట్స్ కౌన్సిల్ సేవలు అభినందనీయం ● సంస్కృతి, వారసత్వ సంపద పరిరక్షణకు కృషి ● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




**విజయవాడ,అక్టోబర్ 1 (వార్తాప్రభ) :** రాష్ట్ర చేనేత, హస్తకళల వైభవాన్ని ముందుకు తీసుకెళ్లడంతో పాటు నేత కార్మికులు, కళాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ క్రాఫ్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. విజయవాడలోని పీవీపీ స్క్వేర్ మాల్‌లో క్రాఫ్ట్స్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (సీసీఏపీ) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చేనేత బజారును గురువారం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. ఆయన సతీమ జితో పాటు సీసీఏపీ కార్యదర్శి ఎస్.రంజన, వైస్ ఛైర్‌పర్సన్ బి.సుజాత తదితరులతో కలిసి ప్రారంభించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 1 నుంచి 4వ తేదీ వం-కు ఉదయం 9.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఈ బజారు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేనేత, హస్తకళలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ముఖ్యంగా యువతలో చేనేత, హస్తకళలపై అవగాహన పెంచి, మన సంప్రదాయ కళలను భావితరాలకు అందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. చేతివృత్తులు, చేనేత వస్త్రాల సుస్థిర అభివృద్ధి కోసం ఎలాంటి లాభాపేక్షా లేకుండా క్రాఫ్ట్స్ కౌన్సిల్ కృషిచేస్తోందన్నారు. చేనేత కార్మికులు, హస్తకళాకారుల సంక్షేమం, డిజైన్ అభివృద్ధి, శిక్షణ, మార్కెటింగ్ తదితరాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వెంకటగిరి, పొందూరు, పెడన తదితర ప్రాంతాల చేనేత వస్త్రాలతో పాటు సంప్రదాయ కళాకృతులను ప్రత్యేక కార్యక్రమాల ద్వారా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. చేనేత, హస్తకళల పరిరక్షణ, ప్రోత్సాహానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. త్వరలో విజయవాడలో జాతీయ సరస్ అజీవిక మేళా జరగనుందని వెల్లడించారు. కొండపల్లి, ఏటికొప్పాక వంటి అపురూప కళా సంపద పరిరక్షణకూ విశేష కృషిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు చేనేత బజారును సందర్శించి చేనేత వస్త్రాలు, హస్తకళా ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా నేత కార్మికులు, కళాకారులకు చేయూతనివ్వాలని కోరారు. కార్యక్రమంలో సీసీఏపీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న న్యాయవాదుల రిలే దీక్షలు

● న్యాయవాదుల రక్షణ చట్టం తక్షణమే ఏర్పాటు చేయాలి :: బీబీఏ డిమాండ్

● కొనసాగుతున్న న్యాయవాదుల రిలే దీక్షలు



**విజయవాడ లీగల్,అక్టోబర్ 1 (వార్తాప్రభ) :**రాష్ట్రంలో న్యాయవాదులపై జరుగుతున్నటువంటి దాడులను అరికట్టటానికి న్యాయవాదుల రక్షణ చట్టం తక్షణమే ఏర్పాటు చేయాలని బిబిఏ అధ్యక్షుడు వి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. బెజవాడ బారసోసియేషన్ న్యాయవాదులపై బెజవాడ పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరించిన తీరు కీ నిరసనగా బి బి ఏ న్యాయవాదులు రిలే నిరాహార దీక్షలు చేస్తున్న విషయం విధితమే. న్యాయవాదులపై అక్రమ కేసులు బనాయించడాన్ని దౌర్జన్యంగా దాడులు చేయడానికి తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలోని వివిధ అన్ని బార్ అసోసియేషన్లు బీపీ న్యాయవాదులకు సంఘీభావం ప్రకటించి అందరూ గురువారం విధుల్ని బహిష్కరించారని పేర్కొన్నారు శనివారం నాడు న్యాయవాదుల రక్షణ చట్టం ఏర్పాటు చేయటం లో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని బీబీఏ అధ్యక్షులు లక్ష్మీనారాయణ తెలిపారు బార్ కౌన్సిల్ సభ్యులు చలసాని అజయ్ కుమార్, వి శ్రీనివాసరాజు, ఆర్ గంగాభవాని, సుంకర రాజేంద్రప్రసాద్, సీనియర్ న్యాయవాదులు పూనూరు గౌతమ్ రెడ్డి, సంపర దుర్గా, శ్రీనివాసరావు, ఏకే భాష తదితరులు ముక్తకంఠంతో న్యాయవాదులపై జరుగుతున్న దాడులను ఖండించారు. ఉత్తరాంధ్ర నుంచి ఎన్నికైనటువంటి బార్ కౌన్సిల్ సభ్యులు ఎస్ కృష్ణమోహన్, బెల్లన రవి, కె జోగేశ్వరరావు, ధోని మంజులత, బండారు వెంకటరమణమూర్తి, కె దుర్గా నాగశ్రీ దీక్ష శిబిరాన్ని సందర్శించి న్యాయవాదులకు సంఘీభావం తెలియజేశారు. గాంధీ జయంతి రోజున కూడా రిలే నిరాహార దీక్ష ఉంటుందని బి బి ఏ ప్రధాన కార్యదర్శి వలిబోయిన కిరణ్ కుమార్ తెలిపారు.

# పేదల సామాజిక భద్రతకు ఎన్‌టీఆర్ భరోసా

● జిల్లాలో 2,23,883 మంది లబ్ధిదారులకు రూ. 86.59 కోట్లు ● పెన్షన్ల పంపిణీలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




**విజయవాడ,అక్టోబర్ 1 (వార్తాప్రభ) :** స్వర్ణాంధ్ర ఏ 2047 లక్ష్యాల సాధనకు అనుగుణంగా పేదలకు సామాజిక భద్రత కల్పించేందుకు, పేదరిక నిర్మూలనకు ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల ఫలాలను అర్హుల ఇంటి వద్దకే అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. గురువారం విజయవాడ అర్బన్, మధురానగర్ లో ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. లబ్ధిదారులతో మాట్లాడి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పారదర్శకంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందుతున్న వారు వాటిని సద్వినియోగం చేసుకుని తమ కుటుంబాల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. జిల్లాలో 2,23,883 మంది లబ్ధిదారులకు రూ. 86.59 కోట్లు మేర పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, ఇతర లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది ఇంటిదగ్గరే పెన్షన్లు అందిస్తున్నట్లు వివరించారు. పంపిణీ సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమానికే కూటమి ప్రభుత్వం తొలి ప్రాధాన్యత

● అర్హులందరికిసంక్షేమ పథకాలు చేరేలా సీఎం చంద్రబాబు నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం - ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ,అక్టోబర్ 1 (వార్తాప్రభ) :** పేదలు, వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. స్థానిక 13వ వార్డు కాకాని నగర్‌లోని కాకాని టవర్స్ మరియు సమీప ప్రాంతాల్లో గురువారం నిర్వహించిన సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో నియోజకవర్గ ఎలక్షన్ పరిశీలకులు మక్కెన మల్లికార్జునరావు, కూటమి నేతలు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే సౌమ్య వృద్ధులు, దివ్యాంగులకు పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ పేదలు, వృద్ధులు, దివ్యాంగులు ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా వారికి అండగా నిలవాలన్నదే కూటమి ప్రభుత్వ సంకల్పమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. గతంలో సంక్షేమ పథకాలు పొందేందుకు ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితులు ఉండేవని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రజల వద్దకే వెళ్లి సంక్షేమ ఫలాలను అందించే విధంగా పాలనను కొనసాగిస్తోందని పేర్కొన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సంక్షేమ పథకాల అమలుపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎమ్మెల్యే సౌమ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, సంబంధిత శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సేవా సంకల్ప్ అభియాన్ వికసిత్ భారత్ - 2047





**తిరువూరు,అక్టోబర్ 1 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లాతిరువూరు మండలం స్థానిక పట్టణంలో గల సిద్ధార్థ క్రియాటివ్ ఈ ఎం ఉన్నత పాఠశాల నందు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివి.మాధవ్ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ సూచన మేరకు మరియు ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షురాలు పోలే శాంతి ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ టౌన్ అధ్యక్షులు వెంపాటి అబ్రహం మణిరత్నం వీరు చేపట్టిన సేవ సంకల్ప కార్యక్రమాలకు అనుగుణంగా ప్రధానమంత్రి మోడీ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా తిరువూరు పట్టణంలో గల సిద్ధార్థ క్రీయేటివ్ ఉన్నత పాఠశాల నందు విద్యార్థిని విద్యార్థులకు వికసిత్ భారత్ 2047 లక్ష్యాన్ని చేరుకోవాలని ఉద్దేశంతో ప్రోగ్రాం ఇంచార్జ్ పొన్నూరు రామ్మోహన్ రావు మరియు టీచర్స్ విద్యార్థిని విద్యార్థులకు డ్రాయింగ్ పోటీ నిర్వహించడం జరిగింది. ఈ పోటీలో విద్యార్థినీ విద్యార్థులకు 6 బహుమతులు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నవారు శేషు మాస్టారు మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వయోవృద్ధులు సమాజానికి అమూల్య సంపద

● వారి అనుభవాలు భావితరాలకు బంగారు బాటలు

● వయోవృద్ధుల రక్షణ, గౌరవం, సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటోంది ● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




**విజయవాడ,అక్టోబర్ 1 (వార్తాప్రభ) :** వయోవృద్ధులు సమాజానికి అమూల్య సంపద అని, వారి జీవిత అనుభవాలు భావితరాలకు ఎంతో విలువైన మార్గదర్శకాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. వయోవృద్ధులు ఎలాంటి పరిస్థితుల్లోనూ అధైర్యపడవద్దని, వారి రక్షణకు చట్టపరమైన రక్షణలు ఉన్నాయని తెలిపారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్‌టీఆర్ జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కార్యక్రమాన్ని గురువారం విజయవాడ బందర్ లాకులలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. డీసీపీ కేజీవీ సరిత, రెండో అదనపు జిల్లా జడ్జి ఎం.సునీల్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వయోవృద్ధులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోందని పేర్కొన్నారు. పిల్లలు తమ తల్లిదండ్రులను గౌరవించాలని.. వారిపట్ల ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని సూచించారు. వయోవృద్ధుల పట్ల నిర్లక్ష్యం లేదా చట్టవిరుద్ధంగా వ్యవహరించే వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. వయోవృద్ధుల జీవితానుభవాలు కుటుంబానికి, నేటి తరానికి, సమాజానికి ఎంతో విలువైనవని పేర్కొన్నారు. డీసీపీ కేజీవీ సరిత మాట్లాడుతూ వయోవృద్ధులు భావితరాలకు మార్గదర్శకులని, వారి అనుభవాలు సమాజానికి ఎంతో విలువైనవని తెలిపారు. వయోవృద్ధుల భద్రత, గౌరవం, సంక్షేమానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా 80 నుంచి 100 సంవత్సరాల వయసున్న పలువురు వయోవృద్ధులతో పాటు వృద్ధాశ్రమాల నిర్వాహకులను ఘనంగా సన్మానించారు. జిల్లా వయోవృద్ధుల సంఘాలు, వృద్ధాశ్రమాలకు చెందిన సుమారు 200 మంది వయోవృద్ధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఎన్‌టీఆర్ జిల్లా విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు వాడ్రేవు కామరాజు, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షులు వేమూరి బాబూరావు, కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# విజయ డైరీ ఫీడ్ కమిటీ సభ్యురాలుగా గొర్ల సుభాషిణి



**పెడన ,అక్టోబర్ 1 (వార్తాప్రభ) :** కృష్ణాజిల్లా పాల ఉత్పత్తిదారుల సహాయ సహకార సంఘం (విజయ డైరీ ) ఫీడ్ కమిటీ సభ్యురాలుగా గొర్ల సుభాషిణి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం నాడు జిల్లా చైర్మన్ దాసరి బాలవర్ధన్ రావు ఉత్తర్వులు జారీ చేశారు. పెడన నియోజకవర్గం బంటుమిల్లి మండలం మల్లేశ్వరం గ్రామ పాల సంఘం అధ్యక్షురాలిగా సుభాషిణి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విజయ డైరీ జిల్లా పాలకవర్గ సభ్యులు అర్జా వెంకట నగేష్ సూచన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ ఈమె పేరును ఈ పదవికి సిఫారసు చేసారు. సుభాషిణి నియామకం పట్ల పలువురు పాల సంఘ అధ్యక్షులు హర్షం ప్రకటించారు.

# ఆర్విపల్లి లో అంగన్వాడి ఉత్సవం




**పెడన,అక్టోబర్ 1 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గం గూడూరు మండలంలోని ఆర్మీ పల్లి గ్రామంలో శుక్రవారం నాడు అంగన్వాడి ఉత్సవం నిర్వహించారు. సేవా సంకల్ప అభియాన్ పేరుతో సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 7 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిశు అభివృద్ధి పథకం( ఐసిడిఎస్) సూపర్వైజర్ వి యు ఉషశ్రీ మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఉపయోగించుకొని కోరారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే విధంగా మహిళలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల యూనిట్ ఇంచార్జ్ మట్టా శ్రీనివాసరావు అంగన్వాడీ కార్యకర్తలు ఎం అరుణ కవిత సిహెచ్ అరుణ జి స్వాతి ఆయాలు పాల్గొన్నారు.

# డ్రగ్స్ ఉచ్చులో పడొద్దు లక్ష్య సాధన దిశగా అడుగులు వేయ్

● సోషల్ మీడియా ట్రాప్‌కు దూరంగా ఉండాలి ● డీసీపీ లక్ష్మీనారాయణ

● రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి ఏసీపీ శ్రీనివాస్





**నందిగామ,అక్టోబర్ 1 (వార్తాప్రభ) :** స్థానిక చందాపురం రోడ్డులోని శ్రీ రస్తు కల్యాణ మండపంలో నందిగామ పోలీసులు ఆధ్వర్యంలో 'త్రిశూల వ్యూహం' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ నిర్మూలన, మహిళా భద్రత, రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, సోషల్ మీడియా వినియోగంపై విద్యార్థులకు పోలీసు ఉన్నతాధికారులు అవగాహన కల్పించారు.

**సోషల్ మీడియా ట్రాప్‌కు దూరంగా ఉండాలి..** ఈ సందర్భంగా డీసీపీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు సోషల్ మీడియా ట్రాప్‌లో పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియాకు అతిగా అలవాటు పడితే చదువుతో పాటు భవిష్యత్తుపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని చేరుకునే దిశగా కష్టపడి చదువుకోవాలని సూచించారు. మొబైల్ ఫోన్ వినియోగాన్ని తగ్గించి తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని విద్యార్థులతో సంభాషించారు.

**రోడ్డు భద్రత పై అవగాహన..** ఏసీపీ చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు, వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని కోరారు. హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.

**అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి..** ఈగల్ ఎస్ఐ దుర్గాభవాని మాట్లాడుతూ తెలియని వ్యక్తులు ఇచ్చే ఆహారం, చాక్లెట్లు లేదా ఇతర వస్తువులను స్వీకరించకుండా జాగ్రత్తగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. "యువతే దేశ భవిష్యత్తు. వారిని మాదకద్రవ్యాల నుంచి కాపాడటం మనందరి బాధ్యత అని వక్తలు తమ ప్రసంగంలో కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో, ఎక్సైజ్, వైద్య శాఖ అధికారులు, నందిగామ ప్రభుత్వ ఆసుపత్రి చైర్మన్ వేపూరి నాగేశ్వర రావు, నందిగామ ఎస్ఐ మోహన్‌రావు, ఎస్ఐ సూర్యవంశి, ట్రాఫిక్ ఎస్ఐ నరేష్, పోలీసు సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# రంగా విగ్రహం తొలగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

-కె.ఆర్.పి.ఎస్ గౌరవ అధ్యక్షులు దాసరి రాము




**విజయవాడ,అక్టోబర్ 1 (వార్తాప్రభ) :** తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరంలో రంగా గారి విగ్రహాన్ని తొలగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గురువారం గాంధీనగర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దాసరి రాము తెలిపారు. ఆయన మాట్లాడుతూ కాపు రిజర్వేషన్ల పై టిడిపి వైఖరి తెలపాలని చంద్రబాబు నాయుడు కాపులకు ఏ విధమైన రిజర్వేషన్లు ఇవ్వకపోగా ఇచ్చినట్లుగా కాగితాలపై చూపించి మోసం చేశారని, ఆయనను దామోదరం సంజీవయ్యతో పోల్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు చంద్రబాబు నాయుడు ఇప్పటికైనా కాపుల పట్ల తన వైఖరి మార్చుకుని న్యాయం చేయాలని, కాపు కార్పొరేషన్ నిధులు విడుదల చేసి మా డిమాండ్లను పరిశీలించి న్యాయం చేయాలని లేనిపక్షంలో కె.ఆర్.పి.ఎస్ నాయకులు అంతా ఉద్యమ బాట పడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రావి శ్రీనివాస్, వంగ ఆంజనేయులు, దామోదరం, మోహన్ రావు, చనమల్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు..

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188

# సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా ఆశా వర్కర్లకు ఘన సన్మానం.



**కూకట్ పల్లి, అక్టోబర్ 1(వార్తా ప్రభ):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్సరాల ప్రజా సేవను పురస్కరించుకొని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నిర్వహిస్తున్న మోదీ ఏ 25 సేవా సంకల్ప అభియాన్ లో భాగంగా కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షులు పి. దుర్గాప్రసాద్ రావు ఆధ్వర్యంలో ఆశా వర్కర్లను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా దుర్గ ప్రసాద్ మాట్లాడుతూ ఆశా వర్కర్లు సమాజానికి అందిస్తున్న సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు శ్రీనివాస్ గౌడ్, సీనియర్ నాయకులు శంకర్ రెడ్డి, వినయ్ కుమార్, ప్రభాకర్, ప్రశాంత్ రావు, శేఖర్, తదితర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# సన్న ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే కసిరెడ్డి



**ఎల్బీనగర్/ వార్తాప్రభ (అక్టోబర్ 1):.** తలకొండపల్లి మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం వద్ద సన్న రకం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి గురువారం ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకుని ప్రభుత్వ మద్దతు ధర పొందాలని, అధికారులు ప్రక్రియను సజావుగా సాగించాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, భావి భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న పేదలకు సీఎం సహాయ నిధి భరోసా

**చింతల్‌లో రూ. 5 లక్షల విలువైన ఎల్వోసీ పత్రాలు అందజేత ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ చొరవతో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం**



**చింతల్, అక్టోబర్ 1, (వార్తాప్రభ) :** ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలు ప్రభుత్వం అందిస్తున్న ఎల్వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు సూచించారు. చింతల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఎల్వోసీ పత్రాలను అందజేశారు. రంగారెడ్డి నగర్ 127వ డివిజన్ గురుమూర్తి నగర్ ప్రాంతానికి చెందిన బి. అనంత లక్ష్మి, ఆమె మామ బి. బాల కిష్టయ్య తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా వైద్య ఖర్చులు భరించలేని స్థితిలో ఉన్న విషయాన్ని స్థానిక నేతలు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ కేపీ వివేకానంద్ దృష్టికి తీసుకెళ్లారు. బాధితుల పరిస్థితిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఒక్కొక్కరికి రూ. 2,50,000 చొప్పున మొత్తం రూ. 5 లక్షల విలువైన ఎల్వోసీని తక్షణమే మంజూరు చేయించారు. మంజూరైన ఎల్వోసీ పత్రాలను చింతల్ కార్యాలయంలో బాధితుల కుటుంబ సభ్యులకు స్థానిక నాయకులు అందజేశారు. ఆపద సమయంలో పెద్ద మొత్తంలో వైద్య సాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు సుధాకర్, జల్దా లక్ష్మీనాథ్, ఎర్వ సాయికిరణ్ (బంటి), తారక రాణితో పాటు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# గాంధీ జయంతి వేడుకలు..

**నేడు కల్వకుర్తిలో మంత్రి జూపల్లి, ఎంపీ,ఎమ్మెల్యేల పర్యటన.**



**ఎల్బీనగర్/ వార్తాప్రభ( అక్టోబర్ 01):** కల్వకుర్తి నియోజకవర్గంలో జరగనున్న అభివృద్ధి, గాంధీ జయంతి కార్యక్రమాల్లో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎం.పి మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పాల్గొననున్నారు. ఉదయం 8:30కు ఆమనగల్‌లో ఎమ్మెల్యే కసిరెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బందికి దుప్పట్లు, స్వీట్లు పంపిణీ. 9:00 గంటలకు కల్వకుర్తి మున్సిపాలిటీ వద్ద గాంధీ విగ్రహావిష్కరణ, అంబేద్కర్ విగ్రహ భూమిపూజ, వార్డు ఆఫీసుల ప్రారంభోత్సవాలు జరగనున్నాయి. నాయకులు, ప్రజలు, మీడియా ప్రతినిధులు పాల్గొనాలని ఎమ్మెల్యే పి.ఎ శేఖర్ విజ్ఞప్తి చేశారు.

# "అనురాగ్" లో ఘనంగా ప్రపంచ వృద్ధుల దినోత్సవం.

**వృద్ధుల సమస్యలు - పరిష్కార మార్గాల పై "అనురాగ్" డా. రామ్ విశ్లేషణాత్మక వివరణ.**






**కాప్రా, అక్టోబర్ 1 :(వార్తా ప్రభ ప్రతినిధి):** యెల్లారెడ్డి గూడ లో కల "అనురాగ్" మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భముగా మురికివాడలలో నివసించే వృద్ధులు ఎదుర్కొనే సమస్యల గురించి ఒక సింపోజియం ను నిర్వహించారు. వీరు ఎదుర్కొనే సమస్యలను గుర్తించి డి పవర్ పాయింట్ స్లైడ్స్ ద్వారా డా. రామ్ ప్రజెంట్ సినిమా చేసారు. 1. వయస్సుకు సంబంధించిన తీవ్రమైన అనారోగ్య సమస్యలు. 2. ఆర్థిక మరియు ఉపాధి లేమి సమస్యలు. 3. మానశిక మరియు సామాజిక సమస్యలు. 4. నివాస మరియు పారిశుధ్య సమస్యలు. ఈ సింపోజియం లో అక్టోబర్ నెల లో వృద్ధులకు ఒక కార్యక్రమమును నిర్వహించి సుమారు 100 నిరుపేద వృద్ధులకు పైన పేర్కొన్న సమస్యలను అధిగమించడానికి అవగాహన కల్పించి, వారికీ చేయూతను అందించాలని అనురాగ్ బృందం నిర్ణయించారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

**- టియుడబ్ల్యూజే 143 జిల్లా కన్వీనర్ మద్దినేని గుట్టయ్య. .**



**మహబూబాబాద్ / నెల్లికుదురు అక్టోబర్ 01 (వార్తా ప్రభ)** నిత్యం జర్నలిస్టుల పక్షాన నిలుస్తూ కలం కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని టియుడబ్ల్యు జే 143 జిల్లా కన్వీనర్ మద్దినేని గుట్టయ్య అన్నారు. నెల్లికుదురు మండల టీయూడబ్ల్యూజే 143 కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు మండల అధ్యక్షులుగా మద్ది వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా వైరు శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా మల్యాల నరసయ్య, సహాయ కార్యదర్శిగా మస్కపూరి సుధాకర్, కోశాధికారిగా జెల్ల ఉపేందర్, కమిటీ సభ్యులుగా పోరండ్ల లక్ష్మణ్, జీలుకర శ్రీధర్, లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని జిల్లా కన్వీనర్ తెలిపారు. ఈ సందర్భంగా గుట్టయ్య మాట్లాడుతూ నిత్యం జర్నలిస్టుల పక్షాన నిలిచి హక్కులను సాధించడమే లక్ష్యంగా టియుడబ్ల్యూజే 143 ముందుకెళ్తుందని అన్నారు. వాటితో పాటు ప్రస్తుతం మనం సాధించుకోవాల్సిన హక్కులు వర్కింగ్ జర్నలిస్టులైన వారందరికీ హెల్త్ కార్డుల విషయంలో అన్ని ప్రైవేట్ కార్పొరేట్ హాస్పిటల్లో వైద్యం అందించేలా... గతంలో ఉన్న రైల్వే పాసులను పునరుద్ధరించే విధంగా.... ప్రభుత్వ అక్రిడేషన్ కార్డులు అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకే అందించే విధంగా పోరాటాలు చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని నూతన కమిటీకి సూచించారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ మా పై నమ్మకంతో బాధ్యతలు అప్పజెప్పినందుకు మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిత్యం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మా నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు.

# కుష్టు వ్యాధి నిర్మూలనకు సమన్వయంతో కృషి చేయాలి.

**- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్.**



**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 01 (వార్తా ప్రభ):** మహబూబాబాద్ జిల్లాను కుష్టు వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు వైద్యాధికారులు, కుష్టు వ్యాధి నోడల్ అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ సూచించారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, కుష్టు వ్యాధి నోడల్ అధికారులతో ఆయన అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ కుష్టు వ్యాధి బృందం అక్టోబర్ 5వ తేదీన మహబూబాబాద్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో, తెలంగాణ రాష్ట్ర కుష్టు వ్యాధి వైద్యాధికారి డాక్టర్ సుష్మ మరియు వారి బృందం సమావేశంలో పాల్గొని, కుష్టు వ్యాధి నివారణ కార్యక్రమానికి సంబంధించిన నివేదికలు, రికార్డుల నిర్వహణ, వాటి సమర్పణపై వైద్యాధికారులకు మరియు నోడల్ అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రస్తుతం గుర్తించిన 64 మంది కుష్టు వ్యాధిగ్రస్తులకు మల్టీ డ్రగ్ థెరపీ (ఎండిటి) మందులను సకాలంలో అందించాలని ఆదేశించారు. కొత్తగా కుష్టు వ్యాధి కేసు నమోదైన ప్రాంతంలో సంబంధిత రోగి నివాసం ఉన్న పరిసర ప్రాంతంతో పాటు గ్రామంలోని అన్ని ఇళ్లలో సర్వే నిర్వహించి, వ్యాధి లక్షణాలు ఉన్నవారిని ముందుగానే గుర్తించి చికిత్స అందించాలని సూచించారు. కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ, వ్యాధి వ్యాప్తిని అరికట్టి మహబూబాబాద్ జిల్లాను కుష్టు వ్యాధి రహిత జిల్లాగా నిలపడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ అర్జున్, డిపిఎంవోలు శ్రీనివాస్ రెడ్డి, సతీష్ రెడ్డి, వాలియా, లార్డమ్మా తదితరులు పాల్గొన్నారు.

# పద్మానగర్ వార్డు ప్రజా సమస్యలపై ప్రత్యేక సమీక్ష

- రెసిడెన్షియల్ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో మున్సిపల్ అధికారుల సమావేశం
- పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిప్యూటీ కమిషనర్ శంకర్ సింగ్ ఆదేశం





**జీడిమెట్ల, అక్టోబర్ 1, (వార్తాప్రభ) :** జీడిమెట్ల సర్కిల్, కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని 285వ పద్మానగర్ వార్డులో గతంలో నిర్వహించిన "వన్ డే ఎవ్రీ వార్డ్ ప్రోగ్రామ్" కార్యక్రమంలో ప్రజలు అందించిన ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జి. శ్రీజన ఆదేశాల మేరకు, జీడిమెట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డి. శంకర్ సింగ్ అధ్యక్షతన మాణిక్య నగర్ కమ్యూనిటీ హాల్‌లో వార్డు పరిధిలోని రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ల (కాలనీ సంక్షేమ సంఘాలు) ప్రతినిధులతో సమన్వయ సమావేశం జరిగింది. గతంలో కమిషనర్ క్షేత్రస్థాయి పర్యటన సందర్భంగా కాలనీవాసులు అందజేసిన వినతులలో ఇప్పటివరకు ఎన్ని పరిష్కారమయ్యాయి, ఎన్ని పనులు పురోగతిలో ఉన్నాయి, ఇంకా ఏఏ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయనే వివరాలను సమావేశంలో క్షుణ్ణంగా సమీక్షించారు. వార్డు పరిధిలోని రహదారుల మరమ్మతులు, పారిశుధ్య నిర్వహణ, మురుగునీటి పారుదల వ్యవస్థ, దోమల నివారణ నిమిత్తం ఫాగింగ్ చర్యలు, వీధి దీపాల నిర్వహణ తదితర అంశాలపై కాలనీ ప్రతినిధులతో విస్తృతంగా చర్చించారు. వార్డు సమగ్రాభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలను అధికారులకు అందించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని సంబంధిత విభాగాల ఇంజనీర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో జీడిమెట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డి. శంకర్ సింగ్, ఏఎంసీలు ఉదయ్ కుమార్, సునీత, డీఈఈ దుర్గా ప్రసాద్, ఏఈఈ ఎన్. అభిరామ్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డీఈఈ శివ ప్రకాష్, ఏఈ సాయి లిఖిత సేన్, ఇన్‌ఛార్జ్ శానిటరీ సూపర్వైజర్ జిలానీ పాషాతో పాటు వివిధ కాలనీల రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ల ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

# తిరుమల వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్న కూన శ్రీనివాస్ గౌడ్



**తిరుమలలో ప్రత్యేక పూజలు నిర్వహించిన కాంగ్రెస్ నేత నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థన**

**తిరుమల, అక్టోబర్ 1, (వార్తాప్రభ) :** కూన కృష్ణ మహాలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ అధినేత, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కూన శ్రీనివాస్ గౌడ్ గురువారం వేకువజామున కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయన స్వామివారి దివ్య మంగళ రూపాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు, మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా కూన శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, ఏడుకొండలవాడి దివ్య ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు తెలిపారు. ఈ దర్శనంలో ఆయనతో పాటు ప్రముఖులు ఇంద్రసేన గుప్త, శ్రీరాములు ఉన్నారు.

వార్తా ప్రభ

# హైదరాబాద్

# ఏఎస్సైగా పదోన్నతి పొందిన గని, రఘురామ్‌రెడ్డి



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అక్టోబర్ 1 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పాల్వంచ: ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా పోలీసు శాఖలో చేరి క్రమశిక్షణ, విధి నిర్వహణతో అంచెలంచెలుగా ఎదిగి ఏఎస్సైగా పదోన్నతి పొందిన గని, రఘురామ్‌రెడ్డిని పాల్వంచ డీఎస్పీ సతీష్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ, నీతి నిజాయితీలతో బాధితులకు సేవలందించాలని సూచించారు. పదోన్నతి పొందిన గని, రఘురామ్‌రెడ్డికి పలువురు పోలీసు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

# ముఖ గుర్తింపు సాంకేతికత ద్వారా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్

**ఆల్ ఇండియా రిటైర్డ్ పెన్షనర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్యాంపెయిన్**






**హైదరాబాద్ :అక్టోబర్ 1 :(వార్తా ప్రభ ప్రతినిధి)** దేశవ్యాప్త డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంపెయిన్--5.0ముఖ గుర్తింపు సాంకేతికత ద్వారా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ ను అక్టోబర్ 1 నుంచి 30 వరకు 80 ఏళ్లు పైబడిన సూపర్ సీనియర్ సిటిజన్లకు అక్టోబర్ 1 నుంచే సేవలను ఆల్ ఇండియా రిటైర్డ్ పెన్షనర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నారు. సీనియర్ సిటిజన్స్ లైబ్రరీ షటిల్ కోర్ట్, 4వ స్ట్రీట్, భవాని అపార్ట్‌మెంట్ పక్కన, ఆర్.కె. నగర్, మల్కాజిగిరి లో కానీ, 98665 60999, 6300 099250, 90523 45682 ఫోన్ నెంబర్ లలో కానీ సంప్రదించవచ్చు. పెన్షనర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు సూచించారు.

# ఏక్ దిన్, ఏక్ ఘంటా, ఏక్ సాత్ లో భాగంగా శ్రమదానం నిర్వహించడం అభినందనీయం

**-శాసనసభ్యులు అరికెపూడి గాంధీ**



**శేరిలింగంపల్లి, అక్టోబర్ 1 (వార్తాప్రభ):** శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని గోపి చెరువు ప్రాంగణంలో సీఆర్‌పీఎఫ్ దక్షిణ విభాగం, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ శేరిలింగంపల్లి జోన్ సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా--2026 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ తుమ్మల విక్రమ్, డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సీఎంసీ అధికారులు, డోయన్స్ టౌన్‌షిప్ వాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ 'ఏక్ దిన్, ఏక్ ఘంటా, ఏక్ సాత్'లో భాగంగా శ్రమదానం నిర్వహించడం అభినందనీయమన్నారు. పరిశుభ్రత, పౌర బాధ్యత, ప్రజల భాగస్వామ్యంతోనే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచగలమన్నారు. గోపి చెరువు పరిసరాలను శుభ్రంగా ఉంచడంతో పాటు చెరువుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో కృషి చేయాలని సూచించారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు కొనసాగుతున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం, ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన, శ్రమదానం, మొక్కల పెంపకం, పారిశుధ్య కార్మికుల సంక్షేమం, ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ డీఐజీలు ప్రవీణ్ ఘాగ్, డాక్టర్ సంజయ్ కుమార్, పంకజ్ కుమార్, సీఎంసీ డీఈ ఆనంద్, డివిజన్ అధ్యక్షుడు రాజు యాదవ్, గౌరవ అధ్యక్షుడు వీరేశం గౌడ్, కిరణ్ కుమార్, షాజీ మాథ్యూ, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.